తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
శుక్రవారం
09 అక్టోబర్ 2026
సంపుటి 03
సంచిక 360
పేజీలు 8
వెల రూ. 5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

# గోదావరి-కావేరి లింక్‌పై కీలక ప్రతిపాదనలు!

- ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు భేటీ..
- ప్రాజెక్టులకు సహాయం అందించాలని విజ్ఞప్తి
- రాష్ట్ర అభివృద్ధిపై ప్రధానితో కీలక చర్చలు
- పోలవరం, గోదావరి పుష్కరాలపై చర్చ
- ఎల్‌నినో ప్రభావాన్ని వివరించిన సీఎం
- నదుల అనుసంధానంపై ప్రతిపాదనలు
- పోర్టుల అభివృద్ధికి 20 వేల ఎకరాలివ్వండి
- 20,378 ఎకరాల భూములు కేటాయించాలి
- పంటల ఎగుమతులకు సహకరించాలి
- పీయూష్ గోయల్‌తో సిఎం చంద్రబాబు భేటీ
- మౌలిక వసతుల ప్రాజెక్టులకు సహకరించండి
- ఓఆర్ఆర్, పోలవరం బ్రిడ్జికి అనుమతివ్వండి
- ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణానికి సహకరించండి
- పోలవరంవద్ద ఐకానిక్ వంతెనకు నిధులివ్వండి
- బీచ్ రోడ్ ప్రాజెక్టుపై కేంద్రం దృష్టి సారించాలి
- మంత్రి నితిన్ గడ్కరీతో భేటీలో సిఎం వినతి
- కేంద్రానికి సిఎం చంద్రబాబు పలు విజ్ఞప్తులు




న్యూఢిల్లీ, అక్టోబర్ 08 ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం (అక్టోబర్ 08) ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధి, ఆర్థిక పరిస్థితి, నీటిపారుదల, మౌలిక వసతులు, కరువు పరిస్థితులు సహా పలు కీలక అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా గోదావరి--కావేరి నదుల అనుసంధానాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్రం చొరవ తీసుకోవాలని కోరారు. భేటీ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల పాలనా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా మోదీ అందించిన సేవలను ప్రస్తావిస్తూ.. దూరదృష్టి, నిర్ణయాత్మక నాయకత్వం, సుపరిపాలనతో దేశ అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వాములుగా చేసుకుని వికసిత్ భారత్ లక్ష్యం వైపు దేశాన్ని నడిపిస్తున్నారని చంద్రబాబు అభినందించారు. గోదావరి వరద జలాల్లో కొంత భాగాన్ని సమర్థంగా వినియోగించి దక్షిణాది రాష్ట్రాల నీటి అవసరాలను తీర్చేలా నదుల అనుసంధానంపై సాంకేతిక అధ్యయనం చేపట్టాలని చంద్రబాబు ప్రతిపాదించారు. గోదావరి--కావేరి అనుసంధానం పూర్తయితే ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ప్రస్తుతం గోదావరి నుంచి సముద్రంలోకి భారీగా నీరు వెళ్లిపోతున్న నేపథ్యంలో ఈ నీటిని సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించే మార్గాలను పరిశీలించాలని కోరారు.పోలవరం ప్రాజెక్టు పురోగతి, నిర్మాణం, పునరావాస పనులపైనా చంద్రబాబు వివరాలు అందించారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో రాష్ట్రంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని, దీనికి కేంద్రం ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని ప్రధానిని కోరారు. 2027 గోదావరి పుష్కరాలు జూన్ 26 నుంచి జూలై 7 వరకు జరగనున్నాయి. లక్షలాది మంది

➢ మిగతా 2వ పేజిలో..

# రాజ్యాంగ సంస్థలు ఎవరి సొత్తు కాదు

- విశ్వసనీయతను దెబ్బతీసే ప్రయత్నాలు
- అనవసర గందరగోళం సృష్టించరాదు
- మాజీ న్యాయమూర్తుల ఘాటు వ్యాఖ్యలు!

2

# బీసీలే మా వెన్నెముక..

- బీసీ రిజర్వేషన్లలో రాజీ లేదు
- 34 శాతంకు కట్టుబడి ఉన్నాం
- మంత్రి నారా లోకేశ్ వెల్లడి



అమరావతి, అక్టోబర్ 08 స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకే తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ మంత్రి నారా లోకేశ్ మరోసారి స్పష్టం చేశారు. ఈ అంశం

➢ మిగతా 2వ పేజిలో..





# జూరాల కాలువకు నీరొదిలిన రైతులపై కేసు

- 14 మంది అన్నదాతలపై ఎఫ్ఐఆర్ నమోదు
- ఇది ప్రజా పాలన కాదు.. ప్రజా పీడన పాలన
- రైతులపై కేసుపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం
- కేసులు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్

2

# వ్యాపారులకు భారీ ఊరట..

- పన్ను అధికారులకు అరెస్ట్ అధికారం రద్దు
- ప్రాసిక్యూషన్ పరిమితి రూ. 5 కోట్లకు పెంపు
- ఇ-కామర్స్ వ్యాపారులకు జరిమానా తగ్గింపు
- ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పై అధ్యయనానికి కమిటీ
- జీఎస్టీ నిభంధనల్లో సంచలన మార్పులు
- జీఎస్టీ రేట్లలో ఊరట.. ఈసారి లేని మార్పులు
- 57వ జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు!

న్యూఢిల్లీ, అక్టోబర్ 08: జీఎస్టీ కౌన్సిల్ గురువారం (అక్టోబర్ 08) ఢిల్లీలోని భారత్ మండపంలో ఒక ముఖ్యమైన సమావేశం నిర్వహించింది. ఈ కౌన్సిల్ ఒక కీలకమైన, చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, జీఎస్టీ కింద ఎటువంటి అరెస్టులు జరగవు. జీఎస్టీ కింద అరెస్టు చేసే అధికారాన్ని కౌన్సిల్ పూర్తిగా

➢ మిగతా 2వ పేజిలో..

# గ్రీన్ కార్డు ప్రక్రియ నిలిపివేత!

- అమెరికాలో పెర్మ్ సస్పెన్షన్..
- ఐటీ దిగ్గజాలకు భారీ షాక్
- భారత టెక్కీల గ్రీన్ కార్డ్ ఆశలు గల్లంతు!

న్యూఢిల్లీ, అక్టోబర్ 08: అమెరికాలో ఐటీ రంగంలో పనిచేస్తూ శాశ్వత నివాస హోదా పొందాలని ఆశపడుతున్న వేలాది మంది భారతీయ నిపుణులకు అమెరికా ప్రభుత్వం తీరని గుండెకోత మిగిల్చింది. అమెరికన్ల ఉద్యోగ అవకాశాలు, వేతన భద్రతను పరిరక్షించడమే ధ్యేయంగా వైట్‌హౌస్ వేదికగా జరిగిన అత్యున్నత సమావేశంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ లేబర్ సంచలన

➢ మిగతా 2వ పేజిలో..

# కాంగ్రెస్ చలో లోక్ భవన్ ముట్టడి ఉద్రిక్తం

- సీఈసీ రాజీనామాకు డిమాండ్ చేస్తూ నిరసన
- భారీ ప్రదర్శనగా ఇండీ కూటమి ప్రతినిధులు ర్యాలీ
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు అరెస్ట్

2



# పేదల ఓట్లు తొలగించే కుట్ర

- ఓటు హక్కు హరణకు బీజేపీ పార్టీ పన్నాగం
- సైమన్ కమిషన్‌లా ఉపయోగించే ప్లాన్
- మోదీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి
- గల్లీ నుంచి ఢిల్లీ వరకూ పోరాటం తప్పదు
- ఢిల్లీ ఇండియా కూటమి నిరసనలో రేవంత్

2

# సీఈసీ రాజీనామా చేయాల్సిందే

- మోదీ, షాకు సద్బుద్ధి కలగాలి
- రాజ్‌ఘాట్ వద్ద ఇండీ నేతల ప్రార్థనలు



న్యూఢిల్లీ, అక్టోబర్ 08 స్వాతంత్ర్యం కోసం పోరాడిన జాతిపిత మహాత్మా గాంధీ ఆశీస్సులతో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ ఎంపీలు స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ ఆందోళన ఆగదని తేల్చి చెప్పారు. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో కలిసి దాదాపు 300 మంది ఉభయ సభల ఎంపీలు బస్సులో రాజ్ ఘాట్?కు వెళ్లారు. జాతిపిత మహాత్మా గాంధీ స్మారకం వద్ద ఒక్కొక్కరుగా నివాళులర్పించారు. దిల్లీలో శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. అంతకుముందు మాట్లాడిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఓట్ల దొంగతనం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, యువత సమస్యలన్నీ ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని చెప్పారు. జవహర్ లాల్ నెహ్రూ, మహాత్మా గాంధీ, వల్లభ్ భాయ్ పటేల్ వంటి మహానాయకులు సాధించి పెట్టిన స్వేచ్ఛను, ఓటు హక్కును బీజేపీ ప్రభుత్వం లాక్కుంటోందని ఆరోపించారు. లోక్?సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తమను రెండు రోజులుగా నిరసన తెలపకుండా అడ్డుకున్నారని, మొదటి రోజు ఎన్నికల సంఘం వద్ద, బుధవారం జంతర్ మంతర్ వద్ద అడ్డుకుని దాడులు చేశారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రహోంమంత్రి అమిత్ షా,

➢ మిగతా 2వ పేజిలో..

జాతీయ దిన పత్రిక
# తరంగాలు
THARANGALU DAILY NEWS
శుక్రవారం, 09 అక్టోబర్ , 2026



## నటుడు నానా పటేకర్ కన్నుమూత

**'నటసామ్రాట్'గా ప్రత్యేక గుర్తింపు**

న్యూఢిల్లీ, అక్టోబర్ 08: భారతీయ సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విలక్షణ నటనకు చిరునామాగా నిలిచిన ప్రముఖ నటుడు నానా పటేకర్ (75) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. గోవాలోని తన నివాసంలో ఆయనకు తీవ్రమైన గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో తెల్లవారుజామున 5:20 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచినట్లు ఆసుపత్రి వర్గాలు ధ్రువీకరించాయి. ఆసుపత్రికి తీసుకొచ్చిన తర్వాత దాదాపు 45 నిమిషాల పాటు వైద్యులు ఆయనను బతికించేందుకు తీవ్రంగా ప్రయత్నించారని, అయినప్పటికీ వారి ప్రయత్నాలు ఫలించలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆయన మరణవార్తతో చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతికి గురైంది. 1978లో 'గమన్' చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన నానా పటేకర్, తన విలక్షణమైన నటన, డైలాగ్ డెలివరీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 'పరిందా', 'అబ్ తక్ ఛప్పన్', 'యశ్వంత్', 'వజూద్' వంటి చిత్రాలతో ఆయన నటనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా 2000 తర్వాత 'శక్తి: ది పవర్', 'అపహరణ్', 'ట్యాక్సీ నెం 9211' వంటి సినిమాల్లో ఆయన నటన విమర్శకుల మన్ననలు పొందింది. ఒకవైపు సీరియస్ పాత్రలతో అలరిస్తూనే, మరోవైపు కామెడీతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. 'వెల్కమ్' (2007), 'వెల్కమ్ బ్యాక్' (2015) చిత్రాలలో ఆయన పోషించిన 'ఉదయ్ శెట్టి' పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుంది. 'రాజ్‌నీతి' చిత్రంలో ఆయన నటనకు ఫిలింఫేర్ అవార్డుకు నామినేట్ అయ్యారు. తన అద్భుత నట ప్రస్థానంలో మూడు జాతీయ అవార్డులను అందుకున్నారు. 2016లో మరాఠీ చిత్రం 'నటసామ్రాట్'లో ప్రదర్శించిన అసమాన నటనకు గాను ఆయన ఫిలింఫేర్ ఉత్తమ నటుడి పురస్కారాన్ని గెలుచుకున్నారు. నటుడిగానే కాకుండా 'యశ్వంత్', 'వజూద్', 'ఆంచ్' వంటి చిత్రాల్లో నేపథ్య గాయకుడిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. నానా పటేకర్ మృతితో భారతీయ సినిమా ఓ గొప్ప నటుడిని కోల్పోయిందని పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

## క్షమాగుణం వల్లే దేశంలో పెరుగుతున్న నేరాలు

ఉండేవని అన్నారు. ఎందుకంటే ఆ రోజుల్లో హత్యలు చాలా అరుదుగా జరిగేవని, కానీ ప్రస్తుత రోజుల్లో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మర్డర్ కేసులో మరణశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చుకున్న ఒక ఖైదీని ముందస్తుగా విడుదల చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగులతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా ఈ వ్యాఖ్యలు చేశారు. 'సుప్రీంకోర్టు క్షమాగుణం వల్లే దేశంలో నేరాలు పెరుగుతున్నాయి. దీనికి ఎక్కడో ఒకచోట ముగింపు పలకాల్సిన అవసరం ఉంది. ఒక తండ్రి తన సొంత పెద్ద కుమార్తెపై అత్యాచారం చేసి, ఆమెను హత్య చేశాడు. ఆ కేసులో అతడి భార్య ఇచ్చిన సాక్ష్యం ఆధారంగా నిందితుడికి జీవిత ఖైదు పడింది. కొన్నేళ్ల తర్వాత ఆ నిందితుడు పెరోల్‌పై బయటకు వచ్చి తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పినందుకు పగతో భార్యను (చిన్న కూతురి కళ్ల ముందే) దారుణంగా హత్య చేశాడు. చిన్న కుమార్తె ఇచ్చిన సాక్ష్యం ఆధారంగా అతడికి కోర్టు మరణశిక్ష విధించింది. అయితే, ఆ నిందితుడు చిన్న కూతురిని చంపలేదనే కారణంతో సుప్రీంకోర్టు అతడి మరణశిక్షను కాస్త మళ్లీ జీవిత ఖైదుగా తగ్గించింది. అందుకే సుప్రీంకోర్టు క్షమించే గుణానికి ఎక్కడో ఒకచోట ముగింపు పలకాల్సిందే' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా పేర్కొన్నారు. మరోవైపు, దిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఇటీవల కాలంలో జరిగిన అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారిస్తున్న సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేశ రాజధాని దిల్లీలో నేరాలను గుర్తించడం, నివారించే అవసరాన్ని వివరించింది. ముఖ్యంగా విద్యాసంస్థల పరిసరాల్లో బీట్ పెట్రోలింగ్‌ను పెంచాలని దిల్లీ పోలీసులు, రవాణా శాఖ, స్థానిక పరిపాలన యంత్రాంగానికి ఆదేశించింది. అలాగే ప్రజా రవాణా వాహనాల డ్రైవర్లు, సహాయకులను కఠినంగా తనిఖీ చేయాలని సూచించింది. అవసరమైన అనుమతులు లేకుండా పనిచేస్తున్న అనధికార మద్యం దుకాణాలు, సంస్థలను గుర్తించి చట్ట ప్రకారం వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణను నవంబర్ 16కు వాయిదా వేసింది.

## గ్రీన్ కార్డు ప్రక్రియ నిలిపివేత!

నిర్ణయం ప్రకటించింది. వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ నేతృత్వంలోని యాంటీ ఫ్రాడ్ టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షణలో ఐటీ ఔట్‌సోర్సింగ్ దిగ్గజాలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ , ఇన్ఫోసిస్, వి?ో, హెచ్‌సీఎల్, కాగ్నిజెంట్, కాప్‌జెమినిలతో పాటు అంతర్జాతీయ టెక్ దిగ్గజాలు మైక్రోసాఫ్ట్, అడోబ్ వంటి సంస్థలపై పెర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ కార్యక్రమం నుంచి తాత్కాలిక సస్పెన్షన్ వేటు వేసింది. ఇకపై ఈ సంస్థల నుంచి కొత్త పెర్మ్ దరఖాస్తులు స్వీకరించబోమని, ప్రస్తుతం ప్రాసెసింగ్‌లో ఉన్న ఫైళ్లను కూడా తక్షణమే నిలిపివేస్తున్నామని తేల్చిచెప్పింది. అసలు అమెరికాలో విదేశీ ఉద్యోగికి ఇబీ-2, ఇబీ-3 కేటగిరీల కింద గ్రీన్ కార్డ్ స్పాన్సర్‌షిప్ ప్రారంభించాలంటే ఈ పెర్మ్ ప్రక్రియే అత్యంత కీలకమైన, చట్టబద్ధమైన మొదటి మెట్టు. సదరు ఉద్యోగానికి అవసరమైన అర్హతలున్న అమెరికన్ పౌరులు ఎవరూ స్థానికంగా అందుబాటులో లేరని, విదేశీయుడిని నియమించడం వల్ల స్థానిక వర్కర్ల వేతనాలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడటం లేదని కంపెనీలు సాక్ష్యాధారాలతో కార్మిక శాఖకు నిరూపించి సర్టిఫికేషన్ పొందాల్సి ఉంటుంది.

## బీసీలే మా వెన్నెముక..

ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని, న్యాయస్థానం నుంచి తీర్పు వెలువడిన వెంటనే ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళతామని తెలిపారు. ఈరోజు ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇటీవల రద్దు చేసిన విషయం తెలిసిందే. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉటంకిస్తూ ఈ తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో లోకేశ్ మాట్లాడుతూ... "తెలుగుదేశం పార్టీకి బీసీలే వెన్నెముక. వారి ప్రయోజనాలను కాపాడటంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదు" అని అన్నారు.

## సీఈసీ రాజీనామా చేయాల్సిందే

జ్ఞానేష్ కుమార్, మోహన్ భగవత్ లు నేరపూరిత కుట్ర ద్వారా రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఓట్లను దొంగిలించి దేశాన్ని హైజాక్ చేశారని, త్వరలోనే ఆ నలుగురిని చట్టం ముందుకు తెస్తామన్నారు. ప్రతిపక్ష ఎంపీలు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలవనున్నారు. అందుకోసం అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. ఆ సమయంలో ఎన్నికల సంఘంపై వస్తోన్న ఆరోపణలకు సంబంధించి వినతి పత్రం సమర్పించనున్నారు. ఇందులో పాల్గొనేందుకు బంగాల్ మాజీ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఇప్పటికే దిల్లీకి చేరుకున్నారు. ఇదిలా ఉండగా, సీఈసీకి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టిన ఇండీ కూటమి ఎంపీలు పట్ల దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై మధ్యప్రదేశ్ కాంగ్రెస్ గురువారం భోపాల్‌లో ఆందోళన నిర్వహించింది. వ్యాపమ్ స్క్వేర్ నుంచి బోర్డ్ ఆఫీస్ స్క్వేర్ వరకు కాంగ్రెస్ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. "ఓటును కాపాడండి, దేశాన్ని కాపాడండి" అనే నినాదంతో భోపాల్ నగర జిల్లా కాంగ్రెస్ కమిటీ నిర్వహించిన ఈ నిరసనలో సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ సహా పలువురు పాల్గొన్నారు. ఓటు హక్కును కాపాడుకునేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో తమ చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతామని తెలిపారు.

## వ్యాపారులకు భారీ ఊరట..

తొలగించింది. అలాగే, ప్రాసిక్యూషన్ పరిమితిని రూ. 1 కోటి నుండి రూ. 5 కోట్లకు పెంచింది. జీఎస్టీ విధానంలో కేంద్ర ప్రభుత్వం మరో కీలక సంస్కరణకు శ్రీకారం చుట్టింది. ఢిల్లీలోని భారత్ మండపంలో గురువారం జరిగిన 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పన్ను చెల్లింపుదారులకు సంబంధించిన అమలు, ప్రాసిక్యూషన్ నిబంధనలపై ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా జీఎస్టీ అధికారులకు ఉన్న అరెస్ట్ అధికారాలను తొలగిస్తూ.. కౌన్సిల్ నిర్ణయించింది. దీంతో జీఎస్టీ ఉల్లంఘనలకు సంబంధించి పన్ను అధికారులు నేరుగా అరెస్ట్ చేసే అవకాశం ఇక ఉండదు. ఇప్పటివరకు తీవ్రమైన పన్ను ఎగవేత, నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వంటి కొన్ని కేసుల్లో జీఎస్టీ అధికారులు అరెస్ట్ చేసే అధికారం ఉంది. ఈ అధికారాన్ని పరిమితం చేయడం ద్వారా సాధారణ పన్ను వివాదాలు, వ్యాపార సంబంధిత పొరపాట్లు క్రిమినల్ చర్యల స్థాయికి వెళ్లకుండా చూడాలనే ఉద్దేశంతో సంస్కరణలు తీసుకొచ్చింది కేంద్రం. పన్ను బకాయిల వసూలు, వడ్డీ, జరిమానాల విధింపు వంటి ఇతర చర్యలు మాత్రం కొనసాగుతాయి. అదే సమయంలో జీఎస్టీ కింద ప్రాసిక్యూషన్ ప్రారంభించే పరిమితిని కూడా భారీగా పెంచారు. ఇప్పటివరకు రూ.1 కోటి పన్ను ఎగవేతకు సంబంధించిన కేసుల్లో ప్రాసిక్యూషన్ ప్రారంభించే అవకాశం ఉండగా.. ఇకపై ఆ పరిమితిని రూ.5 కోట్లకు పెంచారు. అంటే రూ.5 కోట్లకు లోబడిన పన్ను ఎగవేత కేసుల్లో క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు వెళ్లే అవకాశం తగ్గనుంది. ఈ మార్పులను పన్ను వ్యవస్థను మరింత సులభతరం చేయడం, వ్యాపార సంస్థలపై అనవసరమైన చట్టపరమైన ఒత్తిడిని తగ్గించడం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మెరుగుపరచడం వంటి లక్ష్యాలతో కొత్త సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. జీఎస్టీ 2.0లో భాగంగా కేవలం అరెస్ట్, ప్రాసిక్యూషన్ నిబంధనలే కాకుండా.. రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయడం, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వ్యవస్థలో మార్పులు, రిఫండ్లను వేగవంతం చేయడం, వివాదాలను తగ్గించడం వంటి పలు అంశాలపై కూడా కౌన్సిల్ దృష్టి సారించింది. మొత్తంగా చూస్తే, జీఎస్టీ అమలులో కఠినమైన క్రిమినల్ చర్యల కంటే పన్ను వసూళ్లు, అనుసరణ, సులభమైన వ్యాపార విధానాలకు ప్రాధాన్యం ఇచ్చే దిశగా తాజా నిర్ణయాలు ఉన్నాయని చెప్పొచ్చు. అయితే ఈ మార్పులు పూర్తిగా అమల్లోకి రావడానికి అవసరమైన చట్టపరమైన సవరణలు, తదుపరి ప్రక్రియ కూడా కీలకం కానున్నాయి.

## జూరాల కాలువకు నీరొదిలిన రైతులపై కేసు

హైదరాబాద్, అక్టోబర్ 08 జూరాల ఎడమగట్టు కాలువ నుంచి నీటిని విడుదల చేసుకున్న రైతులపై అమరచింత పోలీసులు కేసు నమోదు చేశారు. జూరాల ప్రాజెక్టు అధికారుల ఫిర్యాదుతో 14 మంది రైతులపై ఎఫ్?ఐఆర్ దాఖలు చేశారు. పంటలు ఎండుతున్నందున కాలువలకు నీటిని విడుదల చేయాలంటూ గత నెలలో స్థానిక గ్రామాల రైతులు ఆందోళన నిర్వహించారు. అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో సెప్టెంబర్ 19న ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్? ధ్వంసం చేసి బలవంతంగా నీటిని విడుదల చేసుకున్నారు. దీంతో ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడంతో పాటు అధికారుల విధులకు ఆటంకం కలిగించారంటూ ప్రాజెక్ట్? నీటి పారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సమీవుల్లా అమరచింత ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఆరేపల్లి, మూలమల్ల, క్యాతెపల్లి తదితర గ్రామాల రైతులు భారీగా గుమిగూడి జూరాల ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ యాక్సెస్ డోర్లు, సెక్యూరిటీ ఫాస్టెనింగ్?లు సైతం పగులగొట్టినట్లు డీఈఈ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కంట్రోల్ యూనిట్?లోకి అనుమతి లేకుండా చొరబడి లెఫ్ట్ కెనాల్ గేట్లను బలవంతంగా ఎత్తి, నీటిని విడుదల చేయడంతో దాని స్క్రూరాడ్లు వంగిపోయినట్లు తెలిపారు. ప్రజా ఆస్తులను ధ్వంసం చేసినందుకు కారకులపై తగిన చర్యలు తీసుకోవాలని డీఈఈ తన ఫిర్యాదులో వెల్లడించారు. ఈ మేరకు ప్రాపర్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు అమరచింత ఎస్సై పార్వతి తెలిపారు. అలాగే జూరాల ప్రాజెక్టు నుంచి నీరు వదలాలంటూ సెప్టెంబర్ 21న నిరసన చేపట్టిన బీఆర్?ఎస్, బీజేపీ నేతల పైన కూడా కేసులు నమోదయ్యాయి. మరోవైపు తెలంగాణలో జూరాల సాగునీటి అంశం మరోసారి తీవ్ర రాజకీయ వివాదానికి దారితీసింది. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయంటూ జూరాల ప్రాజెక్టు వద్ద ఆందోళనకు దిగిన రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

## రాజ్యాంగ సంస్థలు ఎవరి సొత్తు కాదు

న్యూఢిల్లీ, అక్టోబర్ 08 దేశంలోని రాజ్యాంగ సంస్థలపై, ముఖ్యంగా ఎన్నికల సంఘం, ఉన్నత న్యాయవ్యవస్థపై జరుగుతున్న విమర్శలపై 42 మంది మాజీ న్యాయమూర్తులు, పదవీ విరమణ చేసిన అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు దేశ పౌరులను ఉద్దేశించి వారు ఓ బహిరంగ లేఖ విడుదల చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాజకీయ వేదికలపై ఎన్నికల సంఘం అధికారులు, న్యాయస్థానాలపై అవమానకరమైన భాషను ఉపయోగించడం ఆందోళనకరమని లేఖలో పేర్కొన్నారు. కొందరు రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఓట్ల దొంగతనం జరిగిందంటూ ఆరోపణలు చేస్తున్నప్పటికీ, అదే ఆరోపణలకు సంబంధించి కోర్టుల్లో అఫిడవిట్లు, ఆధారాలు సమర్పించే విషయంలో వెనక్కి తగ్గుతున్నాయని వారు విమర్శించారు.

## పేదల ఓట్లు తొలగించే కుట్ర

న్యూఢిల్లీ, అక్టోబర్ 08 ఓటమి భయంతోనే బీజేపీ దేశంలోని పేదల ఓటు హక్కును హరించాలని కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పేదలు, దళితులు, గిరిజనులు, ఓబీసీలు, మైనారిటీలు బీజేపీకి వ్యతిరేకంగా మారడంతో ఆ పార్టీ భయపడుతోందని, అందుకే వారి ఓట్లను దొంగిలించాలని చూస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన నిరసనలో రేవంత్ రెడ్డి వరుసగా రెండో రోజు పాల్గొన్నారు. గురువారం రాజ్‌ఘాట్ వద్ద లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలతో కలిసి ఆయన ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో రేవంత్ రెడ్డి బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో భారతీయులను విభజించడానికి బీజేపీ ప్రయత్నించింది. ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు, సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేసింది. ఇప్పుడు ఓటమి ఖాయమని తేలడంతో ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైన వారు అంటూ దేశాన్ని రెండు వర్గాలుగా విభజిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. సుమారు 13 కోట్ల మంది పౌరుల ఓట్లను తొలగిస్తే, అది ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణ ప్రక్రియ అవుతుందని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. "1952 నుంచి జరిగిన ప్రతి ఎన్నికలో ఓటర్ల సంఖ్య పెరిగింది. కానీ ఇప్పుడు, రాబోయే ఎన్నికల్లో దేశంలో మొత్తం ఓటర్ల సంఖ్య తగ్గే విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తున్నారు.

## కాంగ్రెస్ చలో లోక్ భవన్ ముట్టడి ఉద్రిక్తం

హైదారాబాద్, అక్టోబర్ 08 హైదరాబాద్‌లో ఓటర్ల సవరణ ప్రక్రియలో భారీగా అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపునిచ్చిన చలో లోక్ భవన్ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ శ్రేణులు నగరంలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టాయి. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ నిరసన ర్యాలీ లోక్ భవన్ వైపు దూసుకెళ్లింది. వందలాది మంది కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు లోక్ భవన్‌ను ముట్టడించేందుకు యత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో నిరసన తెలుపుతున్న టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి మరియు కాంగ్రెస్ నేత మహమ్మద్ అజారుద్దీన్‌లను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టుల అనంతరం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలపై ప్రజల్లో తీవ్ర అనుమానాలు నెలకొన్నాయని, ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమైన ఓటు హక్కును కాపాడటంలో సిఇసి విఫలమయ్యారని ఆరోపించారు. పారదర్శకమైన రీతిలో ఎన్నికల వ్యవస్థ సాగాలంటే సిఇసి జ్ఞానేశ్వర్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అగ్రనేత ప్రియాంక గాంధీతో పాటు ఇండియా కూటమికి చెందిన పలువురు ఎంపీలను కేంద్ర ప్రభుత్వం అరెస్ట్ చేయించడాన్ని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు.

## మారుమూల పల్లెలకూ బ్యాంకులు, ఆసుపత్రులు

5జీ నెట్‌వర్క్ చేరుకుందని, ప్రస్తుతం 5.5 లక్షలకు పైగా 5జీ బేస్ స్టేషన్లు నిరంతరం సేవలందిస్తున్నాయని తెలిపారు. 2022 నాటి పరిస్థితులతో పోలిస్తే దేశంలో మొబైల్ ఇంటర్నెట్ వేగం ఏకంగా పది రెట్లు పెరగడం గర్వకారణమని చెప్పారు. 'మేక్ ఇన్ ఇండియా', 'ఇన్వెస్ట్', 'ఇన్నోవేట్' నినాదాలతో మొబైల్స్, టెలికాం పరికరాల తయారీలో భారత్ ప్రపంచ కేంద్రంగా అవతరిస్తోందని కొనియాడారు. డిజిటల్ సేవలు పెరుగుతున్న కొద్దీ ఫోన్ సెక్యూరిటీ, నెట్‌వర్క్ భద్రతను పటిష్టం చేయడం అత్యవసరమని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం డీప్‌ఫేక్స్, సైబర్ మోసాలు సమాజానికి అతిపెద్ద సవాలుగా పరిణమించాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు, టెక్ సంస్థలు, ఆర్థిక రంగాలు కలిసి డీప్‌ఫేక్స్‌ను అడ్డుకునేందుకు ఒక గ్లోబల్ ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజల వద్దకు మోసపూరిత సమాచారం చేరకముందే సాంకేతిక సాయంతో అడ్డుకునేందుకు అంతర్జాతీయ టెలికాం ఆపరేటర్లు, జీఎస్ఎంఏ సమష్టిగా పనిచేయాలని సూచించారు. భుత్వ అధినేతగా 25 ఏళ్ల ప్రజాసేవను పూర్తి చేసుకున్న సమయంలో ఐఎంసీ 10వ వార్షికోత్సవం జరుపుకోవడం ఎంతో ప్రత్యేకమని మోదీ చెప్పారు. ఈ ఏడాది జీఎస్ఎంఏ బోర్డు సమావేశానికి భారత్ వేదికగా నిలవడంపై హర్షం వ్యక్తం చేస్తూ, ప్రపంచవ్యాప్తంగా వచ్చిన టెలికాం నిపుణులకు స్వాగతం పలికారు.

## బీజేపీ వ్యతిరేక ఓట్లు తొలగించే కుట్ర

నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వంపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసే వర్గాల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడానికే ఈ సర్ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సీజేపీ, ఇతర పౌర సమాజ ప్రతినిధులతో కలిసి బెంగళూరులోని ఫ్రీడమ్ పార్కులో 'పీపుల్స్ ట్రిబ్యునల్' పేరిట భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అభిజీత్ దీప్కే సహా ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీ, నటుడు, కార్యకర్త అయిన ప్రకాశ్ రాజ్- ఎన్నికల సంఘం తీరుపై విరుచుకుపడ్డారు. సర్ ప్రక్రియను తీవ్రంగా విమర్శించిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో కొందరు తాము బతికే ఉన్నాయని చూయించేందుకు ఈ కార్యక్రమానికి వచ్చారని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే వారిలో కొందరిని వేదికపైకి తీసుకొచ్చి 'వారు భౌతికంగా చనిపోలేదు. కానీ మన దేశంలో ప్రజాస్వామ్యం చనిపోతోంది.' అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

## గోదావరి-కావేరి లింక్‌పై కీలక ప్రతిపాదనలు!

భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఘాట్లు, రహదారులు, పారిశుద్ధ్యం, భద్రత తదితర మౌలిక వసతులపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం లోటు ఏర్పడి వ్యవసాయ రంగంపై ప్రభావం పడిందని చంద్రబాబు ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. 2026 ఖరీఫ్ సీజన్‌లో 21 జిల్లాల్లోని 388 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. జూన్ నుంచి ఆగస్టు మధ్య సాధారణ వర్షపాతంతో పోలిస్తే 53.4 శాతం లోటు నమోదైనట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో కరువు నివారణ, రైతులకు ఉపశమన చర్యల కోసం ప్రత్యేక కేంద్ర సాయం అందించాలని సీఎం కోరారు. అమరావతి ఔటర్ రింగ్ రోడ్, విశాఖ మెట్రో రైల్, బీచ్ కారిడార్ వంటి కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు, ఆర్థిక సహకారం అందించాలని చంద్రబాబు కోరారు. విశాఖ మెట్రో, బీచ్ కారిడార్ ప్రాజెక్టులకు ఆమోదం కోసం ప్రధాని వద్ద ప్రతిపాదనలు ఉంచనున్నట్లు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. అదే సమయంలో రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్, వ్యవసాయ రంగంలో కొత్త సంస్థల ఏర్పాటు, బాహ్య సహాయంతో అమలవుతున్న ప్రాజెక్టులకు కేంద్ర వాటా వంటి అంశాలపైనా సీఎం చర్చించారు. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన పలు కీలక అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లిన ఈ భేటీలో.. ముఖ్యంగా నీటి సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారంగా గోదావరి--కావేరి అనుసంధానానికి కేంద్రం నుంచి వచ్చే స్పందనపై ఆసక్తి నెలకొంది.

## బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ

**• మోరీపిరాల గ్రామంలో పాపమ్మ కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేత**

**రాయపర్తి, అక్టోబర్ 08 (తరంగాలు ప్రతినిధి )**:రాయపర్తి మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు భవిత కుటుంబ సభ్యుల పరామర్శించారు.వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మోరీపిరాల గ్రామానికి చెందిన ఓరుగంటి పాపమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా పాపమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు 50 కేజీల బియ్యం అందజేసి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.బాధిత కుటుంబానికి పార్టీ నాయకులు అండగా ఉంటారని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్య నాయక్, మోరీపిరాల గ్రామ సర్పంచ్ పెద్దగాని నాగరాజు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్, వల్లపు కుమారస్వామి, రెంటాల గోవర్ధన్ రెడ్డి, ఉళ్ళేంగల నర్సయ్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు



కందికట్ల యాకయ్య, సుదర్శన్ రెడ్డి, గటికల్ గ్రామ సర్పంచ్ చెవ్వ కాశీనాదం--హేమలత, గణేష్ కుంట తండా గ్రామ సర్పంచ్ రఘు నాయక్, మూనావత్ రవి, మండల మహిళా నాయకురాలు కాంచనపల్లి వనజరాణి, ఇల్లందుల భగవాన్, చిర్ర మల్లయ్య, గుగులోతు యాకుబ్, నరసింహుల రామ్మూర్తి, గ్రామ పార్టీ అధ్యక్షుడు బొమ్మెరబోయిన ఎల్లయ్య, గ్రామ పార్టీ సీనియర్ నాయకులు కుక్కల ఎర్రసాయిలు, సింగారపు వెంకన్న, చేగురి రామచంద్రు, మరాఠీ బిక్షం, ఓరుగంటి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

THARANGALU DAILY NEWS
శుక్రవారం, 09 అక్టోబర్ , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డిపై లాఠీచార్జ్

•ప్రజాస్వామ్యంపై దాడి



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** 'ఓటు చోరీ' ఆరోపణలపై కేంద్రం సమాధానం చెప్పాలని,సీఈసీ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఇండియా కూటమి ఢిల్లీలో నిర్వహించిన నిరసనలో పాల్గొన్న ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డిపై పోలీసుల లాఠీచార్జ్ తీవ్రంగా ఖండనీయం.ప్రజల ఓట్లతో పార్లమెంట్‌కు పంపిన ఎంపీపై లాఠీ ఎత్తడం అంటే.. ఎన్నుకున్న లక్షలాదిమంది ప్రజల గొంతుపై లాఠీ ఎత్తడమే!ఎన్నికలపై ప్రశ్నలు తలెత్తితే.. కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి.. లాఠీనే మీ జవాబా..?ఇది ప్రజాస్వామ్యమా?ప్రశ్నించే ప్రజాప్రతినిధిపై లాఠీచార్జ్ చేయడమేనా ప్రజాస్వామ్య పరిరక్షణ?లాఠీ దెబ్బలు రఘురాం రెడ్డి స్వరాన్ని ఆపలేవు.ప్రజల ఓటు హక్కు కోసం గొంతు మరింత బలంగా వినిపిస్తూనే ఉంటుంది!ప్రశ్నను లాఠీతో అణచలేరు..ప్రజాస్వామ్య గళాన్ని బలప్రయోగంతో ఆపలేరు!

## ఖమ్మం-వరంగల్- నల్గొండ ఎమ్మెల్సీగా రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి గెలుపును కాంక్షిస్తూ సన్నాహక సమావేశం

•జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి,అర్బన్ జిల్లా కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్,అర్బన్ జిల్లా కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి లు ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గా రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి గెలుపును కాంక్షిస్తూ ది 10-10-2026 న ఉదయం 11.00 గంటలకు ఖమ్మం నగరంలోని ఎస్ ఆర్ కన్వెన్షన్ నందు సన్నాహక సమావేశం ఏర్పాటు చేయనైనదని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు,రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి,తుమ్మలనాగేశ్వరరావు,పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి,శాసనసభ సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, మట్టా రాగమయిదయానంద్పట్టభద్రులఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి లు హాజరగుదురు కావున జిల్లా లోని శాసనమండలి మాజీ సభ్యులు,శాసనసభ మాజీ సభ్యులు, రాష్ట్ర కార్పొరేషన్ మాజీచైర్మన్లు, ప్రస్తుత,మాజీ సుడా చైర్మన్ లు,గ్రంథాలయ చైర్మన్లు,మార్కెట్ కమిటీ చైర్మన్ లు, ఆత్మ కమిటీ చైర్మన్ లు, ఆలయ కమిటీ చైర్మన్ లు,జిల్లా కాంగ్రెస్ నాయకులు, జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు, జిల్లా, నగర కాంగ్రెస్ కమిటి కార్యవర్గ సభ్యులు, మాజీ జెడ్ పి టి సి లు, మాజీ యం పి టి సి లు,ప్రస్తుత, మాజి సర్పంచ్ లు, బ్లాక్,మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు,కార్యవర్గ సభ్యులు,కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంను జయప్రదం చేయాలని పత్రికా ముఖంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్,నాగండ్ల దీపక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



**యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్సి అక్టోబర్ 8 తరంగాలు**

వలిగొండ మండల పరిధిలోని మొగిలిపాక గ్రామానికి చెందిన ఉండాడి ఎల్లమ్మ గురువారం ఉదయం అనారోగ్యంతో మరణించారని తెలుసుకొని వారి కుటుంబానికి 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి అందజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామాశాఖ అధ్యక్షుడు బీమనబోయిన బిక్షపతి,మాజీ సర్పంచ్ జక్కుల శంకరయ్య,పాల సంఘం చైర్మన్ అమీర్శెట్టి శ్రీనివాస్,నాయకులు పబ్బు మల్లేష్ గౌడ్,ముద్దసాని శేఖర్ రెడ్డి,మొగిలిపాక దుర్గయ్య,గుండాల రమేష్,మొగిలిపాక పెంటయ్యా,మర్ల లక్ష్మయ్య,మచ్చ రాజు, సుధాకర్,రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## మొగిలిపాక యాదవ సంఘం భవనానికి రూ.5 లక్షల నిధులు

• ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవతో పెండింగ్ పనులకు మోక్షం



**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి , అక్టోబర్ 8 (తరంగాలు):**

వలిగొండ మండలం మొగిలిపాక గ్రామంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న యాదవ సంఘం భవన నిర్మాణ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రూ.5 లక్షల నిధులను మంజూరు చేయడంతో నిర్మాణ పనులు తిరిగి వేగం పుంజుకున్నాయి.మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మామిడి సత్తిరెడ్డిరెడ్డి ఆధ్వర్యంలో మంజూరైన నిధులను కాంట్రాక్టర్ గంట మురళికి అందజేసి, భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా అభివృద్ధి పనుల్లో భాగస్వాములైన ఏఈ సందీప్‌రెడ్డి, జక్కుల ముత్యాలు, రాజమణి, జడిగే సబిత తదితరులు పాల్గొన్నారు.ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న యాదవ సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి, గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులకు యాదవ సంఘం సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ఒక్కసారి ఆలోచిస్తే సైబర్ మోసాలకు చెక్

• పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** ఒక్కసారి ఆలోచిస్తే.. సైబర్ నేరాలకు చెక్ పెట్టవచ్చని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు.జాతీయ సైబర్ సెక్యూరిటీ అవగాహన కార్యక్రమాలలో భాగంగా భారత ప్రభుత్వం, కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ప్రజలకు సైబర్ భద్రతపై విస్తృత అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ మాసంలో నిర్వహిస్తున్న
"పాజ్ ఫర్ సేఫ్టీ -- థింక్ - వెరిఫై...అనే నినాదంతో రూపొందించిన పోస్టర్లను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రారంభించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు వివిధ రూపాల్లో జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా అనేక మోసాలను ముందుగానే నివారించవచ్చని తెలిపారు.
తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, ఈ-మెయిల్స్, సోషల్ మీడియా లింక్‌లను తొందరపడి నమ్మవద్దని సూచించారు. ఓటిపి, పిన్, సివివి, పాస్‌వర్డ్‌లు, బ్యాంక్ ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని హెచ్చరించారు.ఏదైనా అనుమానాస్పద లింక్ లేదా మెసేజ్ వచ్చినప్పుడు వెంటనే స్పందించకుండా "పాజ్ - ది: ం క్ - - వె రి ె ఎ, ' ' ( ' ' ఆ ం డి ఆలోచించండి.ధృవీకరించండి.సైబర్ మోసాలకు చెక్ పెట్టండి)సూత్రాన్ని పాటించాలని సూచించారు. పెట్టుబడులు, ఉద్యోగాలు,రుణాలు, బహుమతులు,డిజిటల్ అరెస్టులు, కేవైసీ అప్‌డేట్ తదితర పేర్లతో జరిగే మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.సైబర్ మోసానికి గురైనట్లయితే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని, అలాగే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు.తొందరపాటు నిర్ణయం సైబర్ మోసానికి దారితీయవచ్చు.. ఒక్కసారి ఆగి ఆలోచించి, ధృవీకరించిన తర్వాతే స్పందించండి" అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు అక్టోబర్ నెలంతా పాఠశాలలు, కళాశాలలు,మార్కెట్లు,అపార్ట్‌మెంట్,సంఘాలు, రవాణా కేంద్రాలు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లనున్నారు.కార్యక్రమంలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏసీపీ ఫణిందర్, సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్లిష్ట వ్యాధికి అరుదైన శాస్త్ర చికిత్స

• ఛాతీ వ్యాధుల 'మినిమల్లీ ఇన్వాసివ్ థొరాసిక్ సర్జరీ' సోమాజిగూడ యశోద హాస్పిటల్స్

**నల్గొండ-- అక్టోబర్ 8, (తరంగాలు):**



ఊపిరితిత్తులు, అన్నవాహిక, ఛాతీ మధ్య భాగం (మీడియస్టాటినం ), డయాఫ్రమ్ మరియు ఛాతీ గోడకు వచ్చే వ్యాధులను గుర్తించి చికిత్స చేయడానికి సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ అత్యాధునిక విధానాలను ఉపయోగిస్తోంది. ముఖ్యంగా మినిమల్లీ ఇన్వాసివ్, రోబోట్ సహాయంతో చేసే సర్జరీల ద్వారా మెరుగైన వైద్యం అందిస్తోంది. ఊపిరితిత్తుల క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్, ఛాతీలో కణితులు వంటి వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. వ్యాధిని త్వరగా గుర్తించడం వల్ల, పేషెంట్లకు మరింత సురక్షితమైన ఆపరేషన్లను ఆసుపత్రి అందిస్తోంది. దీని ద్వారా ఖచ్చితమైన చికిత్స లభించడమే కాకుండా, పేషెంట్లు త్వరగా కోలుకొని ఆరోగ్యంగా ఇంటికి వెళ్లగలుగుతున్నారు.థొరాసిక్ సర్జరీ అంటే గుండెను మినహాయించి, ఛాతీలో వచ్చే ఇతర వ్యాధులకు చేసే ప్రత్యేకమైన ఆపరేషన్. కొన్ని క్లిష్టమైన సమస్యలకు ఛాతీని పూర్తిగా తెరిచి చేసే ఓపెన్ సర్జరీ తప్పనిసరి అయినప్పటికీ, ఇప్పుడు ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. వీడియో కెమెరా సాయంతో చేసే సర్జరీ , (వివిఏటిఎస్) రోబోట్ సహాయంతో చేసే సర్జరీ ( (ఆర్ఏటిఎస్) వంటి పద్ధతుల ద్వారా కేవలం ఒక చిన్న రంధ్రం లేదా కోతతో ఆపరేషన్లు చేస్తున్నారు. వీటివల్ల పేషెంట్లకు సర్జరీ కోత , నొప్పి చాలా తక్కువగా ఉంటాయి. ఆసుపత్రిలో ఎక్కువ రోజులు ఉండాల్సిన అవసరం కూడా ఉండదు. పేషెంట్లు చాలా త్వరగా తమ పనులు తాము చేసుకోగలుగుతారు. డాక్టర్లు కూడా చుట్టుపక్కల ఉండే అవయవాలకు ఎలాంటి హాని కలగకుండా చాలా కచ్చితత్వంతో ఈ ఆపరేషన్ చేయగలుగుతారు.నల్గొండ లోని ఒక ప్రైవేట్ హోటల్ లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ థొరాసిక్ సర్జన్ డాక్టర్ రోహన్ రెడ్డి సి మాట్లాడుతూ.. "గత పదేళ్లలో ఛాతీ సర్జరీల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. ఈరోజుల్లో చిన్న కోతతో లేదా రోబోట్ సహాయంతో ఆపరేషన్లు చేస్తున్నాం. దీనివల్ల సంక్లిష్టమైన సమస్యలకు కూడా శరీరానికి పెద్దగా ఇబ్బంది కలగకుండా, కచ్చితంగా చికిత్స చేయగలుగుతున్నాం" అని చెప్పారు. "వ్యాధిని ముందుగానే గుర్తించడం, ఆధునిక సర్జరీ నైపుణ్యాలు మరియు అన్ని విభాగాల వైద్యులు కలిసి క్యాన్సర్‌కు వైద్యం చేయడం వల్ల పేషెంట్లకు అత్యుత్తమ చికిత్స అందుతోంది. వారు త్వరగా కోలుకొని సాధారణ జీవితం గడపగలుగుతున్నారు. ప్రతి పేషెంట్ కు వారి ఆరోగ్య పరిస్థితికి తగ్గట్టుగా, ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తూనే, ప్రేమతో కూడిన వైద్యం అందించడమే మా లక్ష్యం" అని ఆయన వివరించారు.
అధునాతన ఆపరేషన్ థియేటర్లు, హై-డెఫినిషన్ ఇమేజింగ్ సిస్టమ్స్, రోబోటిక్ సర్జికల్ ప్లాట్‌ఫారమ్‌లు మరియు థొరాసిక్ సర్జన్లు, పల్మోనాలజిస్టులు, ఆంకాలజిస్టులు, రేడియాలజిస్టులు, అనస్థీషియాలజిస్టులు మరియు క్రిటికల్ కేర్ నిపుణులతో కూడిన మల్టీడిసిప్లినరీ బృందం మద్దతుతో, యశోద హాస్పిటల్స్ అనేక రకాల థొరాసిక్ (ఛాతీ) సమస్యలకు సమగ్రమైన చికిత్సను అందిస్తోంది. ప్రారంభ దశలో ఉన్న ఊపిరితిత్తుల క్యాన్సర్లు మరియు అన్నవాహిక వ్యాధుల నుండి ప్రాణాపాయం లేని ఛాతీ కణితులు మరియు సంక్లిష్టమైన ఛాతీ ఎమర్జెన్సీల వరకు, హాస్పిటల్ ఎవిడెన్స్-బేస్డ్, మినిమల్లీ ఇన్వాసివ్ సర్జికల్ సేవలను నిరంతరం విస్తరిస్తోంది, పేషెంట్లు మెరుగైన భద్రత మరియు సౌకర్యంతో మంచి ఫలితాలను సాధించడంలో సహాయపడుతుంది.
ఈ కార్యక్రమంలో యశోదా ఆసుపత్రి స్టాఫ్ ఉమేష్ సీనియర్ మేనేజర్, వినోద్ అసిస్టెంట్ మేనేజర్ లు పాల్గొన్నారు

## నేడు జరిగే ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో ఈయూ కూటమిని గెలిపించండి

• ఆర్టీసీ సంస్థను కాపాడండి
• మహబూబాబాద్ ఆర్టీసీ డిపో గౌరవాధ్యక్షుడు బి అజయ్ సారథి రెడ్డి పిలుపు

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 08( తరంగాలు ):**



మహబూబాబాద్ జిల్లాలో అక్టోబర్ 9( నేడు )జరిగే ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ కూటమిని గెలిపించి,ఆర్టీసీ సంస్థలను కాపాడాలని కార్మికులకు మహబూబాబాద్ ఆర్టీసీ డిపో యూనియన్ గౌరవాధ్యక్షుడు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర గుర్తింపుకు బస్సు గుర్తుకు రీజియన్ గుర్తింపుకు కాగడా గుర్తుకు ఆర్టీసీ కార్మికులు అధిక సంఖ్యలో తమ ఓట్లు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటాలు చేశామని ఎన్నో కేసులు కూడా పెట్టబడ్డాయని అన్నారు. ఈ సందర్భంగా గుర్తింపు ఎన్నికల్లో బస్సు గుర్తు మరియు కాగడా గుర్తులను గెలిపించాలని కోరారు. పెండింగ్లో ఉన్న డిఏలు పిఆర్సి బకాయిలు విడుదల కోసం ఎంప్లాయిస్ యూనియన్ కూటమినే గెలిపించాలని కోరారు ఎంప్లాయిస్ యూనియన్ కూటమి గెలుపు ద్వారానే కార్మికులకు ఉద్యోగ భద్రత ఉంటుందన్నారు విలీన ప్రక్రియను అడ్డుకునేందుకు అధికార పార్టీ కొన్ని సంఘాలకు మద్దతు తెలుపుతుందన్నారు. ఆర్టీసీ కార్మికులకు మెరుగైన వైద్య సేవలు కార్పొరేట్ స్థాయి వైద్యం అందేందుకు ఎంప్లాయిస్ యూనియన్ ని గెలిపించాలని కోరారు. మహిళా కండక్టర్లకు డ్రైవర్లకు ప్రత్యేక గదులు డిపోల వద్ద ఏర్పాటు చేయడమే ఈయూ కూటమి ధ్యేయమన్నారు. నేడు ఆర్టీసీ ఎన్నికలు జరుగుతున్నాయి అంటే అది ఎంప్లాయిస్ యూనియన్ పోరాటమే అన్నారు అశ్వద్ధామ రెడ్డి తన సొంత రాజకీయ ప్రయోజనాల కోసమే జేఏసీని రెండుగా చీల్చి కార్మికులను విడగొట్టాడని తెలిపారు కార్మికులను ఏకం చేయడానికి ఎన్ఎంయు సహకరించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ సంస్థలు కాపాడడానికి ప్రభుత్వంలో విలీనం చేయడానికి ఎంప్లాయిస్ యూనియన్ కు ఓటు వేయడం ద్వారా ఇవన్నీ సాధ్యమవుతాయని విజ్ఞత గల ఆర్టీసీ కార్మికుల ఓటర్లు ఆలోచించి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గుర్తింపుకు బస్సు గుర్తుపై రీజియన్ గుర్తింపుకు కాగడా గుర్తుపై తమ యొక్క అమూల్యమైన ఓట్లు వేసి గెలిపించవలసిందిగా బి. అజయ్ సారధి రెడ్డి కోరారు.

# బాచుపల్లిలో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ 40వ స్టోర్ శుభారంభం



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 08 ( తరంగాలు )**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి, మియాపూర్ రోడ్డులోని అమీన్‌పూర్‌లో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ తమ 40వ స్టోర్ కు శుభారంభం చేసింది.
ఈ నూతన స్టోర్‌లో దసరా, దీపావళి ప్రత్యేక కలెక్షన్స్‌లో భాగంగా కుటుంబంలో అన్ని తరాల వారి అభిరుచులను ప్రతిబింబించే సంప్రదాయ చీరెలు, పండగ అలంకరణ దుస్తులు, సరికొత్త డిజైన్స్ వంటి వైవిధ్యభరిత ఉత్పత్తులను సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ నిర్వాహకులు ఒకేచోట విక్రయానికి అందుబాటులో ఉంచడం విశేషం. ప్రముఖ నటీమణి కుమారి వైష్ణవి చైతన్యబంగారం జ్యోతిని వెలిగించి, రిబ్బన్ కత్తిరించడం ద్వారా ఈ సరికొత్త స్టోర్ శుభారంభానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున షాపింగ్‌ప్రియులు విచ్చేసి, సౌత్ ఇండియా షాపింగ్‌మాల్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కుమారి వైష్ణవి చైతన్య మాట్లాడుతూ... బాచుపల్లిలో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ తన చేతులమీదుగా శుభారంభం చేసుకోవడం ఆనందకర విషయం అన్నారు. ముఖ్యంగా దసరా, దీపావళి పర్వదినాల సందర్భంగా కుటుంబసభ్యుల అభిరుచులను ప్రతిబింబించే వైవిధ్యభరిత వస్త్రాలు ఈ సరికొత్త స్టోర్‌లో అందుబాటులో ఉండటం విశేషమని ఆమె అన్నారు.
ఈ సరికొత్త స్టోర్స్ శుభారంభం సందర్భంగా సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ యాజమాన్యం వారు విశ్వనగరంగా విస్తరిస్తున్న హైదరాబాద్‌లోని బాచుపల్లి ప్రాంత షాపింగ్‌ప్రియులకు హృదయపూర్వక స్వాగతం పలికి, కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.
పొట్టి వెంకటేశ్వర్లు, ఛైర్‌పర్సన్ అండ్ హోల్-టైం డైరెక్టర్ విశ్వనగరంగా విస్తరిస్తున్న హైదరాబాద్‌లోని బాచుపల్లి ప్రాంతంలో 40వ స్టోర్‌ను ప్రారంభించడం మాకు ఎంతో ఆనందంగా, మరెంతో గర్వకారణంగా ఉంది.
ఈ ప్రాంతంలో షాపింగ్‌ప్రియుల కుటుంబాల సమాఖ్య పెద్ద ఎత్తున ఉండటం, వారి పర్వదిన అవసరాలకు, వివాహ వేడుకలకు సరితూగే వస్త్రాలను మేము అందజేయడం సంతోషదాయకం”బి అన్నారు.
శ్రీ శీర్ణ రాజమౌళి, మేనేజింగ్ డైరెక్టర్ : “దసరా, దీపావళి పర్వదినాలకు, వివాహ వేడుకలకు, కుటుంబసభ్యుల అందరి అవసరాలను దృష్టిలో ఉంచుకుని, వారి అభిరుచులకు అనువైన వస్త్ర ఉత్పత్తులను హాయిగొలిపేలా, అత్యంత సౌకర్యంతో అందజేయడమే మా లక్ష్యం” అన్నారు. శ్రీ తిరువీధుల ప్రసాదరావు, హోల్-టైం డైరెక్టర్ : “మీకు సంప్రదాయాన్ని ప్రతిబింబించే పట్టుచీరెలు కావాలన్నా, పండగ చీరెలు కావాలన్నా, క్యాజువల్ వేర్ కావాలన్నా, కుటుంబంలోని అన్నితరాల వారినీ మెప్పించే వెరైటీలు మా సరికొత్త స్టోర్‌లో ఉన్నాయి” అన్నారు. పవిత్ర దసరా, దీపావళి పర్వదినాలు, అదేవిధంగా వివాహాది శు భకార్యాల సందర్భంగా పూర్తి కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకుని బాచుపల్లిలోని సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ 40వ స్టోర్ అందిస్తున్న ప్రత్యేక కలెక్షన్లు మహిళల కోసం: అందమైన కంచి పట్టుచీరెలు, ఫ్యాన్సీ చీరెలు, భారతదేశ వ్యాప్తంగా మాస్టర్ వీవర్స్ రూపొందిస్తున్న కళాత్మక సమర్పణలు, పెళ్లికుమార్తెకు వన్నె తెచ్చే వైవిధ్యభరిత సంప్రదాయ వస్త్రాలుపురుషుల కోసం శ్రీఅద్భుతమైన డిజైనర్ కుర్తాలు, సాంప్రదాయిక ఎత్నిక్ వస్త్రాలు, ఫార్మల్ సూట్స్, అధునాతన క్యాజువల్ స్టైల్స్‌చిన్నారుల కోసం: ఆకర్షణీయమైన అందాల రంగుల్లో ఆకట్టుకునే ట్రెండీ ఫెస్టివల్ సూట్స్‌సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ వారు బాచుపల్లిలోని మియాపూర్ రోడ్డు, అమీన్‌పూర్ లో సరికొత్తగా ప్రారంభించిన 40వ స్టోర్‌అకు విచ్చేసి... దసరా, దీపావళి పర్వదినాల సందర్భంగా ఆహ్లాదకరమైన షాపింగ్ అనుభూతిని పొందవలసిందిగా, ప్రారంభోత్సవ ఆఫర్లను సద్వినియోగం చేసుకోవలసిందిగా... బాచుపల్లి, మియాపూర్, అమీన్‌పూర్ పరిసర ప్రాంతాలకు చెందిన షాపింగ్‌ప్రియులకు ఆత్మీయ స్వాగతం పలుకుతున్నారు.

# నల్గొండ జిల్లాను టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం





**•జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్.**
**నల్గొండ --అక్టోబర్ 8, (తరంగాలు) :**
వచ్చే ఏడాది చివరి నాటికి నల్గొండ జిల్లాను క్షయవ్యాధి (టీబీ) రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఈ ఏడాది జిల్లాలో మరో 50 శాతం గ్రామాలను టీబీ రహిత గ్రామాలుగా ప్రకటించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌సీసీ, మై భారత్ స్వచ్ఛంద సేవకులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఉదయాదిత్య భవన్ లో జిల్లా క్షయ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. టీబీ బ్యాక్టీరియా ద్వారా వ్యాపించే వ్యాధి అని, ప్రస్తుతం వ్యాధి నిర్ధారణ, చికిత్సకు అవసరమైన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నందున ముందస్తుగా గుర్తిస్తే టి బి పూర్తిగా నయం చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. టీబీ లక్షణాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడంతోపాటు, అనుమానితులకు సకాలంలో పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరుగుతున్నదని, నకిరేకల్, మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జునసాగర్, మర్రిగూడ, నార్కెట్‌పల్లి తదితర ప్రాంతాల్లో టీబి చికిత్సా సేవలు అందుబాటులో ఉన్నాయని, ఈ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీబీ సోకిన వారు వ్యాధి తగ్గిందనే భావనతో మందులను మధ్యలోనే నిలిపివేయకుండా, వైద్యుల సూచన మేరకు కనీసం 6 నెలలపాటు క్రమం తప్పకుండా మందులు వాడాలని కలెక్టర్ సూచించారు.
టీబీ నిర్మూలనలో భాగంగా టీబిని ముందుగానే గుర్తించేలా కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సాంకేతికతను విస్తృతంగా వినియోగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. స్మార్ట్‌ఫోన్లలో టీబీ సంబంధిత యాప్ ను ఉపయోగించడం ద్వారా వ్యాధి లక్షణాలపై ప్రాథమిక అవగాహన కల్పించవచ్చని, స్థానిక భాషలో అడిగే ప్రశ్నలకు సమాధానాలు అందించే సదుపాయం కూడా ఇందులో ఉంటుందని, టీబీపై ఇంటింటికి అవగాహన కల్పిస్తూనే, ఇరుగుపొరుగు వారికి కూడా అవగాహన కల్పించాలని సూచించారు. కృత్రిమ మేధ ఆధారిత మొబైల్ పరీక్షా పరికరాలు కూడా అందుబాటులోకి వచ్చాయని, వాటి వినియోగంపై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని వైద్యాధికారులను ఆదేశించారు. నర్సింగ్ కళాశాలల సిబ్బంది, విద్యార్థులకు ఏఐ ఆధారిత పరీక్షా పరికరాల వినియోగంపై శిక్షణ ఇచ్చి, గ్రామాల్లో నిర్వహించే టీబీ అవగాహన, పరీక్షా కార్యక్రమాల్లో వారి సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ అన్నారు. దీనివల్ల విద్యార్థులకు ప్రాయోగిక శిక్షణ లభించడంతోపాటు, గ్రామస్థాయిలో టీబీ కేసులను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో ఇప్పటికే నిర్వహిస్తున్న ఆరోగ్య సర్వేలను టీబీ నిర్మూలన కార్యక్రమంతో అనుసంధానం చేయాలని అధికారులను ఆదేశించారు. క్షయ నిర్మూలనలో ఎన్‌సీసీ, మై భారత్ స్వచ్ఛంద సేవకులు, సామాజిక స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేసి గ్రామస్థాయిలో అవగాహన, పరీక్ష కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. సర్పంచ్‌లు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు టీబీ నిర్మూలన కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని కలెక్టర్ అన్నారు. గ్రామ సర్పంచులు గ్రామసభలో టి బి ని ఒక ఎజెండాగా పెట్టుకోవాలని కోరారు. టీబి నియంత్రణలో భాగంగా జిల్లాలోఇప్పటికే 126 గ్రామాలను టీబీ రహిత గ్రామాలుగా ప్రకటించినప్పటికి ఆప్రాంతాల్లోనూ వ్యాధి పునరావృతం కాకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ ఏడాది మరో 50 శాతం గ్రామాలను టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దితే జిల్లాలో సగం గ్రామాలను టీబీ రహిత గ్రామాలుగా ప్రకటించే అవకాశం ఉంటుందని ,వచ్చే ఏడాది చివరి నాటికి జిల్లాను పూర్తిగా టీబీ రహిత జిల్లాగా ప్రకటించే లక్ష్యంతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. టీబి నియంత్రణకు రిచ్ ఫౌండేషన్ సామాజిక బాధ్యతగా సుమారు రూ.11 లక్షల విలువైన టీబి నిర్ధారణ పరీక్ష పరికరాలను సి ఎస్ ఆర్ కింద అందించినట్లు వెల్లడించారు .టీ బి వ్యాధిగ్రస్తుల సంక్షేమంలో భాగంగా టీబి సోకిన వారికి నెలకు పోషణ కోసం 1000 రూపాయలు ఇవ్వడం జరుగుతున్నదని, టిబి వ్యాధిగ్రస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని కోరారు. టీబీ నిర్మూలనకు జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ తెలిపారు ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ ఒకప్పుడు టీ బి అంటే ప్రాణాంతకమైన వ్యాధి అని భయపడేవారని, ఇప్పుడు ఆధునిక టెక్నాలజీ, మెడిసిన్స్ అందుబాటులోకి వచ్చినందున భయపడాల్సిన అవసరం లేదని, టీబి నివారణకు డాక్టర్లతోపాటు, ప్రజా ప్రతినిధులు , స్వచ్ఛంద సంస్థలు,టిబి ముక్త్ కోసం కృషి చేసి నల్లగొండ జిల్లాలోటీ బి వ్యాధిగ్రస్తులు లేకుండా చూడాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీలు 126 టిబి రహిత గ్రామాల సర్పంచులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాహుల్, టీబీ అధికారి రవిప్రసాద్, డిపిఓ తరుణ్ చక్రవర్తి, సర్పంచులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఎంపీడీవోలు, ఎన్.సి సి విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. జారీ చేసిన వారు సహాయసంచాలకులు, సమాచార శాఖ నల్గొండ.

## ఉరివేసుకొని యువకుడు మృతి

**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి అక్టోబర్ 08 తరంగాలు**



ఉరివేసుకొని యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఏదుల్లగూడెం గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజాపేట మండలం వసంతపురం గ్రామానికి చెందిన జంగిటి కర్ణాకర్ 25 ప్రస్తుతం ఏదుల్లగూడెంలో నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం ఉదయం ఏదుల్లగూడెం శివారులోని నోముల రామచంద్రకు చెందిన వ్యవసాయ భూమిలో వేప చెట్టుకు చున్నీతో ఉరివేసుకొని మృతి చెందాడు. కర్ణాకర్ ఇంటర్ వరకు చదువుకొని అనంతరం చదువు మానివేసి కూలీ పనులు చేసుకుంటున్నాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసై తరచూ మద్యం సేవించేవాడని, మద్యం సేవించవద్దని కుటుంబ సభ్యులు పలుమార్లు మందలించినా వినేవాడు కాదని పోలీసులు తెలిపారు. రెండు రోజుల క్రితం మద్యం సేవించేందుకు డబ్బులు అడగగా తండ్రి జంగిటి బిక్షపతి డబ్బులు లేవని మందలించడంతో తన సెల్‌ఫోన్‌ను విక్రయించి మద్యం సేవించినట్లు తెలిపారు. అనంతరం కొత్త సెల్‌ఫోన్ కొనుగోలు చేసేందుకు డబ్బులు అడగగా కుటుంబ సభ్యులు డబ్బులు లేవని చెప్పడంతో మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. కర్ణాకర్ వ్యవసాయ భూమిలో ఉరివేసుకొని మృతి చెందిన విషయాన్ని గుర్తించిన వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

## పి వై ఎస్ అధినేత ఆర్థిక సాయం అందజేత



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి అక్టోబర్ 8 తరంగాలు**
వలిగొండ మండల పరిధిలోని మొగిలిపాక గ్రామానికి చెందిన నిరుపేద ఉండాడి ఎల్లమ్మ అకాల మరణం పట్ల తీవ్ర నివాళులు. ఆమె మరణవార్త విన్న వెంటనే రాజకీయాలకు అతీతంగా కేవలం మానవతా దృక్పథంతో స్పందించి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పి వై ఎస్ ఫౌండేషన్ అధినేత పులిపలుపుల రాములు గౌడ్ మృతురాలి భౌతిక కాయానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు,అనంతరం పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి కొండంత ఆత్మస్థైర్యాన్ని కల్పించారు. నిరుపేద కుటుంబ పరిస్థితిని గమనించి,అంత్యక్రియల అత్యవసర ఖర్చుల నిమిత్తం 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పదవులతో నిమిత్తం లేకుండా నిరంతరం ప్రజల కష్ట సుఖాల్లో భాగస్వామ్యమవుతూ, క్షేత్రస్థాయిలో పార్టీ సిద్ధాంతాలను బలంగా ముందుకు తీసుకెళ్తున్న రాములు గౌడ్ సేవా నిరతి అందరికీ ఆదర్శనీయం. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మామిడి సత్తిరెడ్డి,గ్రామశాఖ అధ్యక్షుడు పబ్బు ఎల్లయ్య గౌడ్, మహంకాళి సిద్దయ్య చారి, యాస అంజిరెడ్డి, శ్రీకాంత్,నవీన్,మహేష్, నరేష్,చంద్రమౌళి, సాయిరాం,కార్తీక్,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## త్రిశక్తి ఆలయానికి 55 కిలోల గంట సమర్పించిన కసర బోయిన లింగయ్య యాదవ్



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి అక్టోబర్ 8 తరంగాలు**
వలిగొండ మండల పరిధిలోని అరూరు గ్రామానికి చెందిన యాదవ సంఘం అధ్యక్షులు కసిర బోయిన లింగయ్య యాదవ్ అరుణ దంపతులు మండల కేంద్రంలోని త్రిశక్తి ఆలయంలో అమ్మవారికి 55 కిలోల గంటను గురువారం ఆలయ అర్చకులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి సేవలు పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నాను అమ్మవారి అనుగ్రహంతో ప్రతినిత్యం ఈ గంట నాదాన్ని నైవేద్య సమయంలో విన్న భక్తులకు సర్వమంగళాలు కలుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చక బృందం, నిర్వాహకుడు చిరంజీవి మణినందన్,కుమారి రిసిక తదితరులు పాల్గొన్నారు.

THARANGALU DAILY NEWS
శుక్రవారం, 09 అక్టోబర్ , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# క్రీడాల్లో మెరిసిన పల్లవి హైస్కూల్ విద్యార్థినులు

- రాష్ట్రస్థాయి క్రీడల్లో సత్తా చాటేందుకు సిద్ధం
- నెట్‌బాల్,సాఫ్ట్‌బాల్ పోటీలకు అన్నారం పల్లవి హైస్కూల్ విద్యార్థినుల ఎంపిక
- జోనల్,జిల్లా స్థాయిల్లో అద్భుత ప్రతిభతో రాష్ట్రస్థాయికి ఐదుగురు విద్యార్థినుల ఎంపిక
- రాష్ట్రస్థాయిలో పతకాలే లక్ష్యం - పాఠశాల యాజమాన్యం



**పర్వతగిరి , అక్టోబర్ 08,(తరంగాలు ప్రతినిధి):** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని పల్లవి హైస్కూల్ విద్యార్థినులు క్రీడల్లో తమ ప్రతిభను చాటుతూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు, గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. జోనల్, జిల్లా స్థాయిల్లో నిర్వహించిన నెట్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించి ఐదుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయికి అర్హత సాధించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థినులు క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరుకోవడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

### నెట్‌బాల్‌లో రాష్ట్రస్థాయికి ముగ్గురు విద్యార్థినులు

ఈ నెల 10,11,12 తేదీల్లో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు పల్లవి హైస్కూల్ ఏడవ తరగతి విద్యార్థినులు బి. వక్షిత, బి. అమృత, సీహెచ్. శ్రీవిద్య ఎంపికయ్యారు. జోనల్, జిల్లా స్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో తమ సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు.

సాఫ్ట్‌బాల్‌లోనూ పల్లవి విద్యార్థినుల ప్రతిభ

ఈ నెల 11,12 తేదీల్లో నిజామాబాద్ జిల్లాలో నిర్వహించనున్న మినీ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఏడవ తరగతి విద్యార్థినులు డి.ఎస్. సింధు, జి. నందిని ఎంపికయ్యారు. క్రమశిక్షణతో సాధన చేస్తూ క్రీడల్లో తమ ప్రతిభను నిరూపించుకున్న విద్యార్థినులు రాష్ట్రస్థాయిలోనూ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి పతకాలు సాధించాలని పాఠశాల యాజమాన్యం ఆకాంక్షించింది.

### గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం -- చైర్మన్ రాచకొండ అశోక్ చారి

ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ రాచకొండ అశోక్ చారి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులు ఎంతోమంది ఉన్నారని, వారికి సరైన శిక్షణ, అవకాశాలు, ప్రోత్సాహం కల్పిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించగలరని పేర్కొన్నారు. పల్లవి హైస్కూల్ విద్యార్థినులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని, భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేస్తామని తెలిపారు.

### పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలి -- కరస్పాండెంట్ గంజి మహేందర్

పాఠశాల కరస్పాండెంట్ గంజి మహేందర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులు గెలుపే లక్ష్యంగా కృషి చేస్తూ క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని కోరారు. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించి పల్లవి హైస్కూల్‌కు, అన్నారం గ్రామానికి, వరంగల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణించే విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

### క్రీడలతోనే విద్యార్థుల సమగ్ర వికాసం -- డైరెక్టర్ కోటగిరి రమేష్

పాఠశాల డైరెక్టర్ కోటగిరి రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో క్రీడలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. క్రీడలు కేవలం గెలుపోటములకు సంబంధించినవి కావని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే మనోధైర్యం, క్రమశిక్షణ, పట్టుదలను పెంపొందిస్తాయని వివరించారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, జట్టుగా పనిచేసే సామర్థ్యం పెరుగుతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలోని తమ పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ విజయానికి విద్యార్థినుల నిరంతర సాధనతోపాటు తల్లిదండ్రులు, క్రీడా ఉపాధ్యాయుల ప్రోత్సాహం కారణమని పేర్కొన్నారు. విద్యార్థినులు భవిష్యత్తులో జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

### చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి -- ప్రిన్సిపాల్ మేకల అశ్విని

పాఠశాల ప్రిన్సిపాల్ మేకల అశ్విని మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, స్నేహభావం, పరస్పర సహకారం, క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తాయని వివరించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులు ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని, ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.

### క్రీడా ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు

విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ అందించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యేలా కృషి చేసిన పాఠశాల పీఈటీ శ్రవణ్ కుమార్, క్రీడా కోచ్ కవిత సేవలను పాఠశాల యాజమాన్యం అభినందించింది. విద్యార్థుల విజయాల వెనుక క్రీడా ఉపాధ్యాయుల కృషి ఎంతో విలువైనదని పేర్కొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రాచకొండ అశోక్ చారి, కరస్పాండెంట్ గంజి మహేందర్, డైరెక్టర్ కోటగిరి రమేష్, ప్రిన్సిపాల్ మేకల అశ్విని, కోఆర్డినేటర్లు రాజు, నవ్యశ్రీ, వకుళాదేవి, పీఈటీ శ్రవణ్ కుమార్, కోచ్ కవిత, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఐదుగురు విద్యార్థినులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అన్నారం గ్రామస్తులు అభినందించారు. పోటీల్లో విజయాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి, వరంగల్ జిల్లాకు మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.



# బైక్ పై నాటు సారా దందా బట్టబయలు



**మహబూబాబాద్ జిల్లా అక్టోబర్ 08(తరంగాలు ):** మహబూబాబాద్ జిల్లా బయ్యారం నుండి స్టేషన్ గుండ్రాతిమడుగు వెళ్లే రహదారిలో ఎక్సైజ్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంపై అక్రమంగా నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అడ్డంగా దొరికిపోయాడు లునావత్ శ్రీను అనే వ్యక్తి వద్ద నుండి 4 లీటర్ల నాటుసారాను ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్ తెలిపారు ఈ సందర్భంగా సీఐ రాంప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో నాటుసారా తయారీ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామని అక్రమాలకు పాల్పడితే ఎవరినీ వదిలిపెట్టమని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ఈ తనిఖీలలో ఎస్ఐ శ్రీనివాస్ కానిస్టేబుళ్లు రియాజ్ గోపి పాల్గొన్నారు.

# ఆకలి తీర్చని చారు పేద విద్యార్థుల గోడు ఎవరికి పట్టదు



**మహబూబాబాద్ జిల్లా అక్టోబర్ 08(తరంగాలు ):** మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూర్ మండల కేంద్రంలోని గిరిజన బాలుర వసతి గృహం కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహాలను మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పరిశీలించారు వసతి గృహాల్లో బెడ్స్ లేకపోవడం బాత్రూంలు సరిగా లేకపోవడం విద్యార్థులకు నీళ్ల చారు పొడికారంతో బ్రేక్ ఫాస్ట్ పెడుతుండటాన్ని స్వయంగా చూసి ఆవేదన వ్యక్తం చేశారు విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని అధికారులను కోరారు నూతన భవనం పూర్తయినా ప్రారంభించకపోవడం ఇంటర్మీడియట్ విద్య లేకపోవడంపై రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి నవీన్ నికోలస్ తో ఫోన్ లో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని కోరారు కనీస సౌకర్యాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని వెంటనే మౌలిక వసతులు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు హాస్టల్ వార్డెన్లు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రాహుల్‌కు చిన్న గీత పడినా బీజేపీ పునాదులు కదులుతాయి

- మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్
- రాహుల్ గాంధీ అరెస్టుపై మహబూబాబాద్‌లో కాంగ్రెస్ నిరసన




**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 8 (తరంగాలు):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి చిన్న గీత పడినా బీజేపీ పునాదులు కదిలిపోతాయని మహబూబాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మదర్ థెరిస్సా సెంటర్‌లో 'బ్లాక్ డే' సందర్భంగా మహమ్మద్ ఖలీల్, ఎడ్ల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ నిరసన ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ చేపడుతున్న నిరసనలను అణచివేయాలని చూస్తే అవి మరింత పెద్ద ప్రజా ఉద్యమంగా మారుతాయని హెచ్చరించారు. రాహుల్ గాంధీని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలో అక్రమాలపై ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని, ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజల గొంతును నొక్కే ప్రయత్నం చేస్తే అది మరింత బలంగా వినిపిస్తుందని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, జిల్లా, మండల స్థాయి నాయకులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ సెల్ అధ్యక్షులు, యువజన, మహిళా కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత యువతికి ఈగ మల్లేశం సంఘీభావం





**వర్ధన్నపేట ప్రతినిధి , అక్టోబర్ 08, (తరంగాలు) :** ప్రేమ పేరుతో మోసపోయానని ఆరోపిస్తూ ఆందోళనకు దిగిన బాధిత యువతికి కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం సంఘీభావం తెలిపారు. వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి కుమారుడు శ్రీకాంత్ గత మూడేళ్లుగా పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ప్రస్తుతం వివాహానికి నిరాకరిస్తున్నారని బాధిత యువతి ఆరోపిస్తున్నట్లు ఈ సందర్భంగా మల్లేశం తెలిపారు. ఆమెకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరారు .బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు తమ కుటుంబ సభ్యులపై వచ్చిన ఆరోపణలను కప్పిపుచ్చకుండా, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. అధికారం, అంగబలం ఉన్నవారు కూడా చట్టానికి అతీతులు కారని, ప్రేమ, పెళ్లి పేరుతో మహిళలను మోసం చేయడం తీవ్రమైన అంశమని పేర్కొన్నారు. ఇలాంటి సందర్భాల్లో బాధితులకు సమాజం, ప్రజాప్రతినిధులు అండగా నిలవాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఈ విషయంలో తక్షణమే స్పందించి, పెద్దన్న పాత్ర పోషిస్తూ బాధిత యువతికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఈగ మల్లేశం కోరారు. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కాకూడదని, ఒక ఆడబిడ్డకు అన్యాయం జరిగిందని ఆరోపణలు వచ్చినప్పుడు పార్టీలకు అతీతంగా మానవత్వంతో స్పందించడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గం శాంతిభద్రతలు, నైతిక విలువలకు ప్రాధాన్యతనిచ్చే ప్రాంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వెలుగులు తగ్గితే చీకటే





- సబ్ స్టేషన్లలో ఉన్నతాధికారి ఆకస్మిక తనిఖీ

**మహబూబాబాద్ జిల్లా అక్టోబర్ 08(తరంగాలు ):** జిల్లాలోని 220 కేవీ మహబూబాబాద్ 132 కేవీ అయ్యగారిపల్లి 132 కేవీ గూడూరు విద్యుత్ ఉపకేంద్రాలలో విద్యుత్ భారం పరిస్థితిని తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పనుల విభాగ సంచాలకులు టి. మధుసూదన్ గురువారం పరిశీలించారు ఉపకేంద్రాలలో ప్రస్తుత విద్యుత్ భారం పరివర్తకాల స్థాయి 33 కేవీ విద్యుత్ మార్గాల భారం విద్యుత్ ఒత్తిడి స్థాయిలు విద్యుత్ సామర్థ్య సూచీని పరిశీలించారు. విద్యుత్ సామర్థ్య సూచీని నిర్దేశిత స్థాయిలో ఉంచాలని సామర్థ్య పెంపు పరికరాలను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు 33 కేవీ స్థాయిలో విద్యుత్ ఒత్తిడిని ప్రమాణాల మేరకు నిర్వహించాలని పరివర్తకాల స్థాయిలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వినియోగదారులకు స్థిరమైన విద్యుత్ అందించాలని సూచించారు విద్యుత్ మార్గాల పేర్లను సులభంగా గుర్తించే విధంగా మార్చాలని తెలిపారు పర్యటనలో పర్యవేక్షక ఇంజనీర్ దర్శన్ కుమార్ విభాగ ఇంజనీర్లు హీరాలాల్ కోటేశ్వర్ రావు తిరుపతి సహాయ విభాగ ఇంజనీర్లు సంగీత రమేష్ సహాయ ఇంజనీర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# ఓటర్ చోర్ గద్దీ చోడో

- మహబూబాబాద్ లో ముస్లింల ఆగ్రహ జ్వాల ఈసీ జ్ఞానేష్ కుమార్ డౌన్ డౌన్




**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 08(తరంగాలు ):** మహబూబాబాద్ జిల్లా ఓట్ల చోరీ, ఓటర్ లిస్టులో అక్రమాలకు నిరసనగా మహబూబాబాద్ లో ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తమ జహూరియా హక్ అయిన ఓటు హక్కును కాపాడాలని, చట్టాన్ని ఉల్లంఘించిన అధికారులపై సుప్రీంకోర్టు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా "వోటర్ చోర్ గద్దీ చోడో" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ లీడర్ మహమ్మద్ వాహెద్, అహ్మద్ ఖాన్, మహమ్మద్ ఫరీద్, మౌలానా సయీద్ అహ్మద్, మౌలానా ఆలంగీర్, షేక్ ఆసిఫ్ అలీ, ఫకీర్ మహమ్మద్ ఫజల్, యూసుఫ్, మహమ్మద్ అమీర్, జమీల్, ఎస్.కే. ఖలీల,అమీర్,అంజద్ తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ అయినా క్లోజ్ వాచ్ కాపీ కొడితే డిబార్

- టాస్ పది ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని
- రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్ ఆదేశించారు



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 08(తరంగాలు ):** మహబూబాబాద్ జిల్లా గురువారం కలెక్టరేట్ లో అధికారులతో సమావేశం నిర్వహించారు ఈ నెల 11 నుంచి 17 వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పదో తరగతి మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 వరకు ఇంటర్ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ప్రశ్నాపత్రాల భద్రతకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు విద్యార్థులకు బస్సు తాగునీరు వైద్య సదుపాయాలు నిరంతర విద్యుత్ ఉండేలా చూడాలని ఆదేశించారు 23 నుంచి 30 వరకు ప్రాక్టికల్స్ ఉంటాయని తెలిపారు ఈ సమావేశంలో ఇంచార్జ్ డీఈవో మందుల శ్రీరాములు పర్యవేక్షకులు రాజేష్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ స్కూల్ ద్వారా నాణ్యమైన విద్య





- నాణ్యతలో రాజీ లేకుండా పనులు చేపట్టాలి: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**వర్ధన్నపేటప్రతినిధి, అక్టోబర్ 08,(తరంగాలు)** :నాణ్యతలో రాజీ లేకుండా పనులు చేపట్టాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు.వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి క్రాస్ వద్ద నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు గురువారం పరిశీలించారు. సుమారు 16 ఎకరాల 11గుంటల విస్తీర్ణంలో 200కోట్ల బడ్జెట్ తో నిర్మించనున్న పాఠశాల ప్రాంగణంలో చేపట్టాల్సిన పనులు, ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతిని అధికారులతో కలిసి ఆయన సమీక్షించారు.ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అసెంబ్లీ వేదికగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంటనే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి భూమిని కేటాయించారు.ఈ సందర్భంగా పాఠశాల నిర్మాణానికి సంబంధించిన ప్రణాళిక, భవన నిర్మాణ పనులు, మౌలిక వసతులు, విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులను ఎమ్మెల్యే వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు నిర్ణీత ప్రణాళిక ప్రకారం వేగవంతంగా కొనసాగించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా పాఠశాల నిర్మాణాన్ని చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు సైతం కార్పొరేట్ స్థాయి విద్యా వసతులు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. నిర్మాణంలో ఎక్కడా నాణ్యతా లోపాలు లేకుండా, నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చోట అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించిన ఎమ్మెల్యే, నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ అందుబాటులోకి వస్తే నియోజకవర్గంలోని విద్యార్థులకు ఆధునిక విద్యా వసతులు మరింత చేరువ అవుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, తహసీల్దార్ విజయ్ సాగర్, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చావులోనూ బతుకును పంచుదాం



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 08(తరంగాలు ):** మహబూబాబాద్ జిల్లా అవయవ దానాలపై అపోహలు వీడాలని జిల్లా అవయవదాతల సంఘం అధ్యక్షుడు లయన్స్ పరకాల రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ మాన్యత ఆధ్వర్యంలో అధ్యక్షురాలు వేలూరి శ్యామలాదేవి అధ్యక్షతన వేణుగోపాల స్వామి ఆలయంలో అవగాహన కార్యక్రమం జరిగింది. బ్రెయిన్ డెడ్ తో ఒకరు 8 మందికి ప్రాణదానం చేయవచ్చని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆలయ వాచ్‌మెన్ జాటోత్ భద్రు తన శరీరాన్ని మెడికల్ కాలేజీకి దానం చేస్తూ అంగీకార పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బండి అరుణ, పరకాల కళావతి, రంగవజ్జుల సునీత, వడ్డేపల్లి సునీత, పరకాల లక్ష్మి, రూపిరెడ్డి శ్రీలత, కైరంకొండ విజయ, ఏ.స్వర్ణ, కైరంకొండ లలిత, జిల్లా వాణి, పరకాల శ్రీదేవి, కే. సజిత దేవి, పరకాల పద్మ, అలివేలు. తదితరులు పాల్గొన్నారు.

# చెన్నారంలో భూ రీ-సర్వే పనులను పరిశీలించిన ఆర్డీవో సుమ





**వర్ధన్నపేట ప్రతినిధి , అక్టోబర్ 08,(తరంగాలు):** రీ--సర్వే కార్యక్రమంలో భాగంగా వర్ధన్నపేట మండలం చెన్నారం గ్రామంలో కొనసాగుతున్న భూ రీ--సర్వే ప్రక్రియను వరంగల్ ఆర్డీవో సుమ గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న రీ--సర్వే పనుల పురోగతిని ఆమె పరిశీలించి, సర్వే ప్రక్రియకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రీ--సర్వేను పారదర్శకంగా, సమర్థవంతంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.అనంతరం గ్రామ ప్రజలతో మాట్లాడి రీ--సర్వేకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ, భూ వివరాల నమోదులో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట తహసీల్దార్ విజయ్ సాగర్, గ్రామ సర్పంచ్ , సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆర్టిఐ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసినందుకు నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ రాష్ట్రస్థాయి అవార్డు

**నల్గొండ-- అక్టోబర్ 8 (తరంగాలు) :**



సమాచార హక్కు చట్టం అమలులో భాగంగా నల్గొండ జిల్లాలో సమాచార హక్కు చట్టం సెక్షన్ 4 (1) బి కింద సమాచారాన్ని స్వచ్ఛందంగా వెల్లడించడంలో ఉత్తమ పనితీరు కనిపించినందుకు గాను నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్ నుండి ఉత్తర్వులు అందాయి .ఈ నెల 9న సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఈ అవార్డును స్వీకరించనున్నారు. జిల్లా కలెక్టర్ కు సమాచార హక్కు చట్టం అమలు లో ఉత్తమ కలెక్టర్ గా రాష్ట్రస్థాయి అవార్డు రావడం పట్ల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సమాచార హక్కు చట్టం అసోసియేషన్లు, ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు.

జాతీయ దిన పత్రిక

తరంగాలు

# ఆయిల్‌పామ్ రైతులు శాస్త్రీయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలి






- నీటి పొదుపు,బిందు సేద్యంపై కలెక్టర్ సత్య శారద సూచనలు
- వర్ధన్నపేట మండల ఆయిల్‌పామ్ రైతు కమిటీ హాజరు

**వరంగల్ ప్రతినిధి , అక్టోబర్ 08,తరంగాలు :** ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆయిల్‌పామ్ రైతులు భూగర్భ జలాలు, నీటి వనరులను సంరక్షించుకుంటూ బిందు సేద్యం ద్వారా శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను పాటించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. తక్కువ నీటితో అధిక లాభాలు అందించే పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని ఆమె కోరారు.గీసుకొండ మండలం కొనేమాకులలోని పీడీఆర్ గార్డెన్స్‌లో గురువారం వరంగల్ జిల్లా ఆయిల్‌పామ్ రైతుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని, అధిక నీటి వినియోగం అవసరమయ్యే పంటలకు బదులుగా నీటి పొదుపు పద్ధతులను అవలంబించాలని సూచించారు.ఆయిల్‌పామ్ సాగులో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై ఏలూరు జిల్లా పెదవేగిలోని జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వి. ప్రసాద్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం, పరాగసంపర్క కీటకాల వినియోగం, గెలల అభివృద్ధి తదితర అంశాలను వివరించారు. శాస్త్రవేత్త రాజు పోషకాల యాజమాన్యంపై రైతులకు సూచనలు అందించారు.జిల్లా ఉద్యాన అధికారి ఆర్. శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచడంతో పాటు రైతుల ఆర్థికాభివృద్ధికి ఉద్యానశాఖ అందిస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### వర్ధన్నపేట మండల ఆయిల్‌పామ్ రైతు కమిటీ హాజరు

ఈ సదస్సుకు వర్ధన్నపేట మండల ఆయిల్‌పామ్ రైతు కమిటీ అధ్యక్షుడు తక్కలపల్లి సత్యనారాయణ, కమిటీ సభ్యులతో పాటు మండలంలోని పలువురు ఆయిల్‌పామ్ రైతులు హాజరయ్యారు. సాగులో మొక్కల పెరుగుదల, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, తెగుళ్ల నివారణ, తోటల సంరక్షణ వంటి అంశాలపై వారు అవగాహన పొందారు.ఈ సందర్భంగా వర్ధన్నపేట మండల కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కమిటీ కృషి చేస్తుందని తెలిపారు.కార్యక్రమంలో ఆయిల్‌పామ్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉద్యాన అధికారులు రాకేష్, జ్యోతి, మానస తదితరులు పాల్గొన్నారు.




# పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

- అర్హులైన ప్రతి ఒక్కరూ నవంబర్ 6లోగా దరఖాస్తు చేసుకోండి
- బీజేపీ నాయకురాలు రావు పద్మారెడ్డి పిలుపు



**హనుమకొండ ప్రతినిధి , అక్టోబర్ 08 (తరంగాలు):** వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోని అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాల్సిన బాధ్యత అందరిపై ఉందని బీజేపీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన రావు పద్మారెడ్డి పిలుపునిచ్చారు. అర్హులైన పట్టభద్రులు వెంటనే తమ ఓటును నమోదు చేసుకోవడంతో పాటు, ఇతరులకు కూడా అవగాహన కల్పించి నమోదు చేయించాలని కోరారు.నవంబర్ 2023 నాటికి డిగ్రీ లేదా దానికి సమానమైన అర్హత కలిగిన డిప్లొమా పూర్తి చేసి, సంబంధిత నియోజకవర్గ పరిధిలో నివసిస్తున్న అర్హులు ఫారం--18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని, దరఖాస్తు చేసుకోవడానికి నవంబర్ 6 చివరి తేదీగా పేర్కొన్నారు.అర్హులైన పట్టభద్రులు ఆఫ్‌లైన్‌లో లేదా తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ హ్ట్ట్ప్స్://ఎచెఒతెలన్గన.గొవ్.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు సమయంలో ఓటరు గుర్తింపు కార్డు (ఈపిఐసీ ), ఆధార్ కార్డు, డిగ్రీ లేదా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, మొబైల్ నంబర్ వంటి వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు.బీజేపీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఈ ఓటరు నమోదు కార్యక్రమాన్ని మహాయజ్ఞంలా చేపట్టాలని రావు పద్మారెడ్డి విజ్ఞప్తి చేశారు.నియోజకవర్గంలోని ప్రతి అర్హుడైన పట్టభద్రుడిని కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించి, దరఖాస్తు చేసుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్ట నిబంధనలు పాటించాలి

- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు:
- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. అప్పయ్య



**హనుమకొండ ప్రతినిధి , అక్టోబర్ 08 (తరంగాలు):**
హనుమకొండ పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, సిబ్బంది అర్హతలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డా. అప్పయ్య గురువారం తనిఖీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా యూరోకేర్ హాస్పిటల్, శాంతి సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్, డా. సుమన్ కిడ్నీ అండ్ ఆండ్రో కేర్ హాస్పిటల్, వేద హాస్పిటళ్లను సందర్శించి అక్కడ అందిస్తున్న వైద్య సేవలు, వైద్య సిబ్బంది వివరాలు, సంబంధిత రికార్డులు, పరిశుభ్రత, రోగుల భద్రతకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా డా. అప్పయ్య మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ కేంద్రాలు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం కింద నమోదు చేసుకోవాలని సూచించారు. చట్టంలోని నిబంధనలు, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు.వైద్యులు, పారామెడికల్ సిబ్బంది అర్హతలు, వైద్య పరికరాల లభ్యత, అత్యవసర వైద్య సేవలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, రోగుల వైద్య రికార్డుల నిర్వహణలో నిర్దేశిత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఆసుపత్రుల్లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతోపాటు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలన్నారు.నిబంధనలను ఉల్లంఘించే వైద్య సంస్థలపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా జిల్లాలోని ప్రైవేట్ వైద్య సంస్థలపై తనిఖీలు, పర్యవేక్షణ నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.



# గురువుల గౌరవం విజిలెన్స్ కమిటీకి కొత్త శక్తి

- డోర్నకల్ లో ఉపాధ్యాయుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘన సన్మానం

**డోర్నకల్ నియోజకవర్గం అక్టోబర్ 08(తరంగాలు ):** మహబూబాబాద్ జిల్లా, డోర్నకల్ నియోజకవర్గం నుంచి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా ఎంపికైన గుగులోత్ కిషన్ నాయక్, గొల్లపల్లి రజినీకాంత్ లకు ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇంచార్జి విద్యాశాఖ అధికారి మందుల శ్రీరాములు మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు.అనంతరం సన్మాన గ్రహీతలు కిషన్ నాయక్, రజినీకాంత్ మాట్లాడుతూ, విజిలెన్స్ కమిటీ సభ్యులుగా తమకు అప్పగించిన బాధ్యతలను నిజాయితీగా నిర్వహిస్తామని, ఎస్సీ, ఎస్టీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బహుజన మహిళా వేదిక రాష్ట్ర కన్వీనర్ విజయ్ కుమారి, టీఎస్ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ వీరు నాయక్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చాగంటి ప్రభాకర్,




కేజీబీవీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి మాలోతు మంజుల, టీజీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ నాయక్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాలోత్ భద్రు నాయక్, భాస్కర్ నాయక్, మద్దెల వీరస్వామి, ధరావత్ బద్రు నాయక్, జిల్లా కార్యదర్శి దాసరి మహేందర్, ఐక్యవేదిక జిల్లా నాయకులు ధరావత్ వీరన్న, బానోత్ హరి నాయక్, ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ అసోసియేషన్ నాయకులు నాయిని కుమారస్వామి, తెలంగాణ గెజిటెడ్ ఫోరమ్ జిల్లా కార్యదర్శి డి.పి. గణేష్, ఆదివాసి సంస్కృతి కమిటీ రాష్ట్ర కార్యదర్శి వట్టం భాగ్యమ్మ, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ల ప్రతినిధి భవాని, కొరవి మాజీ జెడ్పీటీసీ వీరభద్రం, కొరవి కాంగ్రెస్ మండల అధ్యక్షులు బాలేగాని శ్రీనివాస్, ఐక్యవేదిక నాయకులు ఇద్దయ్య,కోటయ్య,విజయ్ కుమార్, రమేష్, యాకూబ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

- రాయపర్తి మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి
- ఓటు చోరీపై పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీ అరెస్ట్‌ను ఖండిస్తూ కాంగ్రెస్ నిరసన



**రాయపర్తి, అక్టోబర్ 9 (తరంగాలు ప్రతినిధి):** సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని రాయపర్తి మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఏఐసీసీ, పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు రాయపర్తి మండలం కాట్రపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్ట్‌ను ఖండిస్తూ ఈ నిరసన నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాయపర్తి మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న ఓటు చోరీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, సీనియర్ నాయకులు, ఇండియా కూటమి ఎంపీలపై దౌర్జన్యానికి పాల్పడటం, లాఠీచార్జి చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జాటోత్ హామ్య నాయక్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, మండల ముఖ్య నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ నాయకులు, స్థానిక ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు చొరవతో "ఒక్కటైన ప్రేమజంట"





- ఇరువర్గాల కుటుంబాలతో చర్చలు.. వివాహానికి ఒప్పించిన ఎమ్మెల్యే
- నాలుగు రోజుల శ్రీదేవి దీక్షకు తెర.. శ్రీకాంత్ కుటుంబం అంగీకారం
- ప్రేమ వివాహం చేసుకున్న ఎమ్మెల్యే.. ప్రేమికుల పక్షాన నిలిచిన నాయకుడు
- నూతన వధూవరులకు నూతన వస్త్రాలు అందజేసి ఆశీర్వదించిన ఎమ్మెల్యే నాగరాజు-మల్లీశ్వరి దంపతులు

**వర్ధన్నపేట ప్రతినిధి, అక్టోబర్ 08, (తరంగాలు)** ప్రియుడు శ్రీకాంత్‌తో వివాహం జరిపించాలని కోరుతూ నాలుగు రోజులుగా దీక్ష చేస్తున్న దళిత యువతి శ్రీదేవి ఆందోళనకు ఎట్టకేలకు ముగింపు లభించింది. వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కే.ఆర్. నాగరాజు ప్రత్యేక చొరవతో శ్రీకాంత్, ఆయన కుటుంబ సభ్యులు వివాహానికి అంగీకరించారు.ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ఆధ్వర్యంలో ఇరువర్గాల కుటుంబ సభ్యులతో చర్చలు జరిపి సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు కృషి చేశారు. ఎమ్మెల్యే చొరవతో శ్రీకాంత్ కుటుంబ సభ్యులు వివాహానికి అంగీకారం తెలపడంతో నాలుగు రోజులుగా కొనసాగుతున్న శ్రీదేవి దీక్షకు ముగింపు పలికారు.ఈ సందర్భంగా శ్రీకాంత్--శ్రీదేవి పరస్పరం వివాహ దండలు మార్చుకుని తమ వివాహ బంధానికి శ్రీకారం చుట్టారు. దీంతో అక్కడి వాతావరణం ఆనందోత్సాహాలతో నిండిపోయింది. దళిత సంఘాల ప్రతినిధులు, మహిళలు, కుటుంబ సభ్యులు, వర్ధన్నపేట పట్టణవాసులు ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు చొరవను అభినందించారు.అనంతరం ఎమ్మెల్యే నివాసానికి వచ్చిన నూతన దంపతులను ఎమ్మెల్యే నాగరాజు వారి సతీమణి మల్లీశ్వరి నూతన వధూవరులకు పెళ్లి వస్త్రాలు అందజేసి ఆశీర్వదించారు.

**ప్రేమ వివాహం చేసుకున్న ఎమ్మెల్యే.. ప్రేమికుల పక్షాన నిలిచిన నాయకుడు**

తాను కూడా ప్రేమ వివాహం చేసుకున్న వ్యక్తిగా ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ప్రేమ, వివాహం విషయంలో ఎదురయ్యే ఇబ్బందులను అర్థం చేసుకుని ఈ యువజంటకు అండగా నిలిచారు. యువతి నాలుగు రోజులుగా దీక్ష చేస్తున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి, ఇరువర్గాలతో మాట్లాడి వివాహానికి మార్గం సుగమం చేశారు."ప్రేమించిన ఇద్దరు యువతీ యువకులు తమ జీవితాన్ని కలిసి కొనసాగించాలనుకుంటే, కుటుంబాల మధ్య అపార్థాలు ఉండకూడదు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుని వారి భవిష్యత్తుకు అండగా నిలవాలి" అనే దృక్పథంతో ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు వ్యవహరించారు.ఎమ్మెల్యే చొరవతో నాలుగు రోజులుగా కొనసాగిన శ్రీదేవి దీక్షకు తెరపడటంతో కుటుంబ సభ్యులు, మద్దతుదారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రేమజంటకు వివాహం జరగడంతో "ఎట్టకేలకు శ్రీదేవికి న్యాయం జరిగింది" అంటూ పలువురు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్, ఇల్లంద మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య,ఐనవోలు దేవస్థానం చైర్మన్ ప్రభాకర్ గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డి, మండల అధ్యక్షులు పోశాల వెంకన్న గౌడ్ ,1వ డివిజన్ అధ్యక్షులు చిర్ర రాము గౌడ్, సీనియర్ నాయకులు బుద్దే పెద్దన్న,వర్ధన్నపేట మండల యూత్ అధ్యక్షులు భాను ప్రసాద్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఝాన్సీ రాజేందర్ రెడ్డి

- కాట్రపల్లి, కిష్టాపురం గ్రామాల్లో బాధిత కుటుంబాలకు పరామర్శ



రాయపర్తి, అక్టోబర్ 08,తరంగాలు ప్రతినిధి : మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన ప్రముఖులు, హన్మకొండ ఏకశిలా హాస్పిటల్ డైరెక్టర్ కుందూరు వెంకట్ రెడ్డి ఇటీవల మృతి చెందగా, గురువారం టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆయన స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.
అనంతరం హైదరాబాద్‌లో ఉద్యోగరీత్యా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎస్ఐ వీరన్న స్వగ్రామమైన కిష్టాపురానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరన్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు ఝాన్సీ రాజేందర్ రెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు ధైర్యం చెబుతూ, వారి బాధలో తాము సైతం పాలుపంచుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దు

- హెల్పింగ్ హ్యాండ్ డీ-అడిక్షన్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పూజిత, డాక్టర్ అనితా రెడ్డి




**హనుమకొండ ప్రతినిధి , అక్టోబర్ 9 (తరంగాలు)**:మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దు అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పూజిత, డాక్టర్ అనితా రెడ్డి అన్నారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) హనుమకొండ ఆధ్వర్యంలో మత్తుపదార్థాల వినియోగం, మద్యపానం దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి వెంకట హైమ పూజిత, నార్కోటిక్స్ శాఖ యాంటీ డ్రగ్ కమిటీ సభ్యురాలు, అనురాగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి హనుమకొండలోని హెల్పింగ్ హ్యాండ్ డీ-అడిక్షన్ కేంద్రాన్ని సందర్శించారు.కేంద్రంలో చికిత్స పొందుతున్న వారిని ఆత్మీయంగా పలకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంస్థ నిర్వాహకుడు రాము నుంచి కేంద్రం నిర్వహణ, బాధితులను చేర్చుకునే విధానం, కౌన్సెలింగ్ ప్రక్రియ, అందిస్తున్న చికిత్స, చికిత్స పూర్తయిన తర్వాత నిర్వహిస్తున్న ఫాలోఅప్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం మద్యం అధికంగా సేవించడం, మత్తుపదార్థాల దుర్వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి పూజిత, డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ.. మత్తుపదార్థాల వినియోగం వ్యక్తుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని, చెడు వ్యసనాలకు బానిసై ఎంతోమంది తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని అలవర్చుకోవాలని సూచించారు.అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకునే విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఇతరుల ప్రలోభాలకు లోనై చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని హితవు పలికారు. మత్తుపదార్థాల దుర్వినియోగానికి సంబంధించిన చట్టపరమైన అంశాలు, బాధితులకు అందుబాటులో ఉన్న సహాయ మార్గాలపై అవగాహన కల్పించారు.ఏవైనా ఇబ్బందులు ఎదురైతే 100 నంబర్‌కు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు లేదా నార్కోటిక్స్ శాఖకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మత్తుపదార్థాల బారినపడిన వారు సరైన చికిత్స, కౌన్సెలింగ్ ద్వారా సాధారణ జీవితంలోకి తిరిగి రావడానికి కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి వెంకట హైమ పూజిత, హెల్పింగ్ హ్యాండ్ డీ-అడిక్షన్ కేంద్రం నిర్వాహకుడు రాము, అడ్వకేట్ రవి, పవన్ తదితరులు పాల్గొన్నారు.




# అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు కావాలి





- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్
- ఇల్లంద, పర్వతగిరిలో బీజేపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్రోల్మెంట్ కార్యశాలలు

**వర్ధన్నపేట ప్రతినిధి, అక్టోబర్ 08,(తరంగాలు):** వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు.వర్ధన్నపేట నియోజకవర్గంలోని ఇల్లంద, పర్వతగిరి ప్రాంతాల్లో ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై కార్యశాలలు నిర్వహించారు. వర్ధన్నపేట మండల అధ్యక్షుడు అడుప రాజు, పర్వతగిరి మండల అధ్యక్షుడు హార్కవత్ వినోద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలకు డాక్టర్ వన్నాల వెంకటరమణ, కొండేటి శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత ప్రభుత్వ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్స్ డిగ్రీ లేదా తత్సమాన అర్హత కలిగిన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో అర్హులైన వారిని గుర్తించి, ఫారం--18 ద్వారా ఓటరుగా నమోదు చేయించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.అర్హత కలిగిన పట్టభద్రులు సంబంధిత నియోజకవర్గ పరిధిలో సాధారణ నివాసితులై ఉండటంతో పాటు భారత పౌరులై ఉండాలని పేర్కొన్నారు. ఓటరు నమోదు నిబంధనలపై పట్టభద్రులకు అవగాహన కల్పించి, అర్హులెవరూ నమోదు ప్రక్రియకు దూరం కాకుండా చూడాలని నాయకులు సూచించారు.